ఏపీ, ఢిల్లీ ఫలితాలకు సారూప్యత

- అభివృద్ధిని నిర్లక్ష్యం చేసి అవినీతిలో కూరుకుపోవడంతోనే ఇక్కడ వైసీపీ, అక్కడ ఆప్‌ల ఓటమి
- రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ... మెయిన్‌లో



బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని సత్కరిస్తున్న నాయకులు

క్రైమ్ రేటు పెరిగితే ఉపేక్షించేది లేదు

నగర పోలీస్ అధికారులకు డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా హెచ్చరిక

- డ్రగ్స్, మత్తుమందుల రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపాలని ఆదేశం
- రౌడీయిజం, భూకబ్జాలకు తావులేకుండా ముందస్తు వ్యూహాలు రూపొందించుకోండి



సమీక్ష నిర్వహిస్తున్న డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా. చిత్రంలో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, ఇతర అధికారులు ఉన్నారు.

విశాఖపట్నం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి):

నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో క్రైమ్ రేటు పెరిగితే ఉపేక్షించేది లేదని రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ (డీజీపీ) హరీష్‌కుమార్‌గుప్తా హెచ్చరించారు. డీజీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా ఆయన ఆదివారం నగర పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా సీఐ, అంతకంటే పైస్థాయి అధికారులతో పోలీస్ కమిషనరేట్‌లోని సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. నగరంలో నమోదవుతున్న నేరాలు, వాటిని పరిష్కరిస్తున్న విధానం, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, గంజాయి రవాణా, విక్రయం, వినియోగానికి అడ్డుకట్ట

... మిగతా 6వ పేజీలో



ఎస్సీ జాతీయ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న దేవస్థానం ఈవో వేండ్ర త్రినాథరావు

అప్పన్నను దర్శించుకున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా

సింహాచలం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి):

సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం షెడ్యూల్డు కులాల జాతీయ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వేండ్ర త్రినాథరావు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కిషోర్ మక్వానా గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, ఈఓ శాలువాతో సత్కరించి స్వామివారి ఫొటోను, ప్రసాదాలను అందజేశారు.

విదేశీ ఉద్యోగాల పేరిట వల



నిరుద్యోగులను ముంచేస్తున్న ఏజెన్సీలు

- వెల్డింగ్, ఫైర్ సేఫ్టీల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పిస్తామంటూ ప్రకటనలు
- రూ.లక్షల్లో వసూలు
- విజిటింగ్ వీసాలపై దుబాయ్ తరలింపు
- అక్కడకు వెళ్లగానే పాస్‌పోర్ట్‌లు స్వాధీనం
- పరీక్షల పేరుతో డ్రామా
- అక్రమ వలసదారులుగా నానా ఇబ్బందులు పడుతున్న యువకులు
- నగరంలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ఏజెన్సీలు
- 50 వరకూ ఉన్నట్టు పోలీసుల అంచనా
- ఏయూ అధ్యాపకులతో అధ్యయనానికి పోలీస్ కమిషనర్ నిర్ణయం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవితంలో స్థిరపడాలంటే విదేశాలకు వెళ్లి ఉద్యోగం చేయాలని చాలామంది భావిస్తుంటారు. విద్యార్హతలు లేనివారు సైతం ఏదో ఒక దేశానికి వెళ్లాలని ఆరాటపడుతుంటారు. అలాంటి వారి ఆశలను కొంతమంది ఏజెంట్లు సొమ్ము చేసుకుంటున్నారు. విదేశాల్లో ఉద్యోగాలిప్పిస్తామంటూ రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు. విజిటింగ్ వీసాలపై విదేశాలకు పంపించి ముఖం చాటేస్తున్నారు.



షార్జా నుంచి విమానాశ్రయానికి వచ్చిన బాధితులతో సీపీ శంఖబ్రత బాగ్చి (ఫైల్ ఫొటో)

విదేశాల్లో ఉద్యోగాలంటూ కొంతమంది ఏజెన్సీలు పెట్టి నిరుద్యోగులను దోచుకుంటున్నారు. దుబాయ్, సింగపూర్ వంటిచోట్ల వెల్డింగ్, ఫైర్ సేఫ్టీల్లో ఉద్యోగాలు ఉన్నాయని, తమ ఇనిస్టిట్యూట్‌లో చేరితే ఆయా రంగాల్లో తగిన శిక్షణ ఇచ్చి, విదేశాల్లో అవకాశాలు కల్పిస్తామంటూ నమ్మబలుకుతున్నారు. విశాఖపట్నం నగరంలో ఇలాంటి ఇనిస్టిట్యూట్‌లు సుమారు 50 ఉండగా, అందులో 40 వరకూ గాజువాక, మల్కాపురం, ఆటోనగర్, మిగిలినవి ద్వారకానగర్, సిరిపురం, మద్రిపాలెం వంటి ప్రాంతాల్లో ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు. విదేశాలకు వెళ్లి ఐదేళ్లపాటు బాగా సంపాదించుకుని వచ్చేస్తే...ఇక్కడ ఏదో పని చేసుకుని కుటుంబంతో గడిపేయవచ్చునని ఆశపడుతున్నవారంతా ఇలాంటి ఏజెన్సీల వలలో చిక్కుకుంటున్నారు. ఏజెన్సీలు/ఏజెంట్లు చెప్పినట్టు వారి ఇనిస్టిట్యూట్‌లో చేరి వెల్డింగ్, ఫైర్ సేఫ్టీ వంటి రంగాల్లో శిక్షణ తీసుకుంటున్నారు. వెనుకాముందు ఆలోచించకుండా వారు అడిగినంత డబ్బు చెల్లిస్తున్నారు.

తీరా అక్కడకు వెళ్లిన తర్వాత ఏదో ఒక కారణం చూపి...అనుకున్న ఉద్యోగానికి ఎంపిక కాలేదని చెప్పి, హౌస్ కీపింగ్, హెల్పర్ వంటి పనులు చేయాలని ఆదేశిస్తున్నారు. తప్పదనుకున్నవారు విజిటింగ్ వీసాలపైనే దొంగచాటుగా ఏదో ఒకపని

... మిగతా 6వ పేజీలో

జాతీయ క్రీడల్లో జ్యోతికి స్వర్ణ పతకం



విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి):

నగరానికి చెందిన ఒలింపియన్, అర్జున అవార్డీ ఎర్రాజీ జ్యోతి జాతీయ క్రీడల్లో సరికొత్త రికార్డు నెలకొల్పింది. డెహ్రాడూన్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన 100 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి స్వర్ణ పతకం సాధించింది. ఈ మీట్‌లో 100 మీటర్ల హర్డిల్ రేస్‌ను 13.1 సెకన్లలో పూర్తి చేసి జాతీయ క్రీడల్లో కొత్త రికార్డును నెలకొల్పింది. ఈ సందర్భంగా ఆమెకు జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డి.నాగేశ్వరరావు, ఎం.నారాయణరావు, ఇతర ప్రతినిధులు అప్పలరాజు, రాంకుమార్, తదితరులు అభినందనలు తెలిపారు.

క్రెబ్స్‌పై కొరడా

- కెమికల్ కంపెనీని మూసివేయాలని కాలుష్య నియంత్రణ మండలి ఆదేశం
- విజయవాడ శివారున వ్యర్థాలను పారబోసినట్టు విచారణలో నిర్ధారణ
- తొలుత షోకాజ్ నోటీసు... తరువాత మూసివేతకు ఆదేశం



క్రెబ్స్ బయో కెమికల్ కంపెనీ

విశాఖపట్నం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి జిల్లా కశింకోట మండలం కొత్తపల్లిలో ఉన్న క్రెబ్స్ బయో కెమికల్ కంపెనీని మూసివేయాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) ఆదేశించింది. కంపెనీలో ఉత్పత్తుల ద్వారా వచ్చే ప్రమాదకర ఘన, జల వ్యర్థాలను విజయవాడ రూరల్ మండలం జక్కంపూడిలోని పొలాల్లో పారబోయడాన్ని పీసీబీ తీవ్రంగా పరిగణించింది. దీనిపై కంపెనీకి ఏపీపీసీబీ షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఆ తరువాత ఉత్పత్తుల నిలిపివేత, కంపెనీ మూసివేతకు ఈ నెల 7న సభ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు.

క్రెబ్స్ బయో కెమికల్ అండ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో పలు రకాల రసాయన ఉత్పత్తులు తయారుచేస్తున్నారు. ఈ ఉత్పత్తుల్లో కొన్నింటిని సిమెంట్ తయారీకి ముడి సరకుగా వాడతారు. ఈ క్రమంలో కంపెనీ నుంచి ఎప్పటికప్పుడు లారీల్లో ఉత్పత్తులు కృష్ణా జిల్లా జగ్గయ్యపేటలో గల సిమెంట్ కంపెనీకి రవాణా చేస్తుంటారు. అయితే కంపెనీలో ఉత్పత్తుల తయారీ సమయంలో వచ్చే ఘన, జల వ్యర్థాలను యాజమాన్యం శుద్ధి చేయాల్సి ఉంది. ఆ ప్లాంటుకు వెళ్లాల్సిన లారీ ఒకటి ఈ నెల 3న కృష్ణా జిల్లా విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి గ్రామ సమీపంలో పొలాల్లో వ్యర్థాలను పారబోసింది. దీనిపై పత్రికల్లో కథనాలు రావడంతో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తనిఖీ చేసి ల్యాబ్‌కు పంపగా, అటువంటి ఫార్ములాతో ఉత్పత్తులు చేసేది క్రెబ్స్ కంపెనీగా గుర్తించారు. వెంటనే విజయవాడలోని పీసీబీ అధికారులు విశాఖలోని పీసీబీ అధికారులకు సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో విశాఖలో ప్రాంతీయ పర్యావరణాధికారి పి.ముకుందరావు, ఇతర అధికారులు నేరుగా కంపెనీని తనిఖీ చేసి ఉత్పత్తులను పరిశీలించారు. విజయవాడ సమీపంలో పారబోసిన వ్యర్థాలు క్రెబ్స్ కంపెనీవిగా నిర్ధారించి షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. దీంతో ఈ నెల 7న సభ్య కార్యదర్శి శరవణ్ కొత్తపల్లిలో క్రెబ్స్ కంపెనీ మూసివేయాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కంపెనీపై అనేక ఫిర్యాదులు

క్రెబ్స్ బయో కెమికల్ కంపెనీపై

... మిగతా 6వ పేజీలో

కబళించిన కెరటం

- ఇరువురూ అన్నదమ్ముల బిడ్డలే...
- నగరంలో నివాసం

రాంబిల్లి మండలం వాడపాలెం సముద్ర తీరంలో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి, మరొక విద్యార్థి గల్లంతు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ విష్ణుస్వరూప్, ఇతర పోలీసు అధికారులు. (ఇన్‌సెట్‌లో) సూర్యతేజ, పవన్‌తేజ (ఫైల్ ఫొటోలు)

రాంబిల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం వాడపాలెం సముద్ర తీరంలో ఆదివారం సాయంత్రం విషాదం చోటుచేసుకుంది. స్నానానికి దిగిన ఇంజనీరింగ్ విద్యార్థి ఒకరు ప్రమాదవశాత్తూ చనిపోగా, మరొకరు గల్లంతయ్యారు. ఈ ఘటనకు సంబంధించి రాంబిల్లి పోలీసులు, మెరైన్ పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

మండలంలోని కొత్తపేటకు చెందిన అన్నదమ్ములైన మొక్క శ్రీధర్, మల్లికార్జునరావులు విశాఖలో స్థిరపడ్డారు. ఎల్ అండ్‌టిలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న శ్రీధర్ కంచరపాలెం ప్రాంతంలోని ఇంద్రానగర్‌లో, సీఐఎస్ఎఫ్‌లో పని చేస్తున్న మల్లికార్జునరావు దువ్వాడ సంధ్యానగర్‌లో నివాసం ఉంటున్నారు. శ్రీధర్ ఒక్కగానొక్క కుమారుడు సూర్యతేజ (17) తగరపువలస అనిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో, ఆదినారాయణ ఒక్కగానొక్క కుమారుడు పవన్‌తేజ (17) దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నారు. శ్రీధర్, మల్లికార్జున రావులు పూజల నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం స్వగ్రామమైన కొత్తపేట వచ్చారు. పూజా కార్యక్రమాలు పూర్తిచేసుకొని మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో వాడపాలెం సముద్ర తీరానికి వెళ్లారు. సూర్యతేజ, పవన్‌తేజ సహా నలుగురు తీరానికి సమీపంలో స్నానాలు చేస్తుండగా బలమైన కెరటం ఒకటి లోపలకు లాగేసింది. తీరం వద్ద బీట్‌లో ఉన్న మెరైన్ పోలీసులు చూసి ముగ్గురిని రక్షించారు. మరొకరి ఆచూకీ దొరకలేదు. మెరైన్ పోలీసులు రక్షించిన ముగ్గురిలో కొనఊపిరితో ఉన్న సూర్యతేజ (17) ఆస్పత్రికి తరలించేలోగా చనిపోయాడు. గల్లంతైన పవన్‌తేజ (17) ఆచూకీ కోసం పోలీసులు, మెరైన్ పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, రాంబిల్లి సీఐ నరసింగరావు,

... మిగతా 6వ పేజీలో

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

జిల్లాలో 34,679 మంది విద్యార్థులు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు సైన్స్ (ఎంపీసీ, బైపీసీ) గ్రూపులకు చెందిన 34,679 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణకు 146 కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు

... మిగతా 6వ పేజీలో

హైదరాబాద్, విజయవాడలకు 12 ప్రత్యేక బస్సులు



- ఎల్‌టీటీతో పాటు మరో రెండు రైళ్లు రద్దవ్వడంతో ఆర్టీసీకి పెరిగిన తాకిడి - 6లో

పూర్ణామార్కెట్ వద్ద

ఆక్రమణల తొలగింపునకు నేతల మోకాలడ్డు

- ఆశీల్ దందాకూ సపోర్టు
- రెండు రోజుల క్రితం చర్యలకు సిద్ధమైన జీవీఎంసీ అధికారులపై ఒత్తిళ్లు
- వెనుతిరిగిన సిబ్బంది
- సర్వత్రా విమర్శలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి):

పూర్ణామార్కెట్ వద్ద మెయిన్‌రోడ్డులో పార్కింగ్‌కు కేటాయించిన చోట అనధికారికంగా ఏర్పాటుచేసిన దుకాణాల తొలగింపు విషయంలో జీవీఎంసీ అధికారులు వెనక్కి తగ్గడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అందుకు రాజకీయ నాయకుల ఒత్తిళ్లే కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



పూర్ణామార్కెట్ పార్కింగ్ ప్రదేశంలో నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు

ప్రధానరోడ్డును ఆక్రమించి దుకాణాలు ఏర్పాటుచేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది అవుతోంది. ఈ సమస్యపై జీవీఎంసీ, పోలీస్ అధికారులకు పలువురు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకున్న పాపానపోలేదు. మార్కెట్‌లో ఆశీల్ వసూలు చేస్తున్న వ్యక్తులే దగ్గరుండి రోడ్డుపై దుకాణాలు పెట్టించి, వారి నుంచి రోజుకు రూ.200-300 వసూలు చేస్తున్నారు. ఆశీల్ దందా, రహదారుల ఆక్రమణపై ఈనెల ఆరు, ఏడు తేదీల్లో 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టర్ ఎంఎన్‌హరేంధిరప్రసాద్ స్పందించారు. పూర్ణామార్కెట్ రోడ్డులో అక్రమంగా వెలసిన దుకాణాలను తొలగించడంతోపాటు జీవీఎంసీ గెజిట్‌కు పది రెట్లకుపైగా ఆశీల్ వసూలుచేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలంటూ జోన్-4 కమిషనర్‌ను ఆదేశించారు. ఈ మేరకు జోన్-4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు తన సిబ్బందితోపాటు

... మిగతా 6వ పేజీలో

ఢిల్లీ విజయంతో బీజేపీ సంబరాలు

పద్మనాభం రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ ఎన్నికల్లో ఘన విజయంతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం వచ్చిందని బీజేపీ రాష్ట్ర సభ్యులు ఉప్పాడ అప్పారావు పేర్కొన్నారు. దేశ రాజధానిలో ఢిల్లీలో కాషాయం జెండా రెపరెపలాడుతుంటే ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. ఢిల్లీలో బీజేపీ విజయం నేపథ్యంలో ఆదివారం రెడ్డిపల్లిలో విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. భారీ కేక్ కట్ చేసి మిఠాయిలు తినిపించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షుడు టి.నాగమణి, నాయకులు రెడ్డిపల్లి శ్రీనివాసరావు, మత్స సోమేశ్వరరావు, ఎస్.వెంకటరావు, పాలూరి కృష్ణారావు. తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా క్యాష్ కౌంటర్ల నిర్వహణ

» అవుట్ సోర్సింగ్, టెంపరరీ సిబ్బందితో విధులు



క్యాష్ కౌంటర్‌లో విధులు నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

సింహాచలం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో పర్మినెంటు ఉద్యోగులు ఎంతమంది ఉన్నా నగదు లావాదేవీలు నిర్వహించే ప్రధాన కౌంటర్లలో అవుట్ సోర్సింగ్, గార్డులు విధులు నిర్వహిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేవదాయశాఖ రీజినల్ కమిషనర్‌చంద్రశేఖర ఆజాద్ గతంలో ఆలయంలో జరిగిన కొన్ని సంఘటనల కారణంగా నగదు లావాదేవీలు జరిగే కౌంటర్లలో పర్మినెంట్ ఉద్యోగులే ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే ఆ నిబంధనలకు విరుద్ధంగా భక్తులు రద్దీగా ఉన్న శనివారం పీఆర్వో ఆఫీసులోని క్యాష్ కౌంటర్‌లో పర్మినెంట్ కాని ఉద్యోగులు ఇద్దరు అధిక సమయం విధులు నిర్వహించటం, అలాగే అన్నప్రసాద విరాళాల కౌంటర్‌లో కూడా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

'పరీక్ష పే చర్చ'ను వీక్షించండి

భీమునిపట్నం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రితో ఈ నెల 10న జరగనున్న పరీక్ష పే చర్చ కార్యక్రమాన్ని విద్యార్థులు వీక్షించాలని భీమిలి ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ జ్యోతి కుమారి ఒక ప్రకటనలో కోరారు.

నేడు కన్యకా పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం

పద్మనాభం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పద్మనాభం జంక్షన్ సమీపంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ఎనిమిదో వార్షికోత్సవం సోమవారం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి పంచామృతాభిషేకం, 108 కలశాలతో ఆలయ ప్రదక్షిణ అనంతరం అమ్మవారికి జలాభిషేకం, విశేష కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఉంటుందన్నారు.

సూర్యనారాయణునికి భక్తుల నీరాజనం



సూర్య విగ్రహం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

సింహాచలం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పవిత్ర మాఘమాసాన్ని పురస్కరించుకుని ప్రత్యక్ష దైవంగా పూజలందుకునే సూర్యనారాయణునికి భక్తులు నీరాజనాలు సమర్పించారు. సూర్యునికి ప్రీతికరమైనది మాఘ మాసం, అందులోనూ ఆదివారం మరింత ముఖ్యమైనది కావటంతో సూర్యోదయానికి ముందు నుంచే నగరం నుంచి పెద్దసంఖ్యలో భక్తులు కృష్ణాపురంలోని సింహాచల దేవస్థానానికి చెందిన సూర్యదేవాలయానికి చేరుకున్నారు. పలువురు భక్తులు దీపారాధనలు చేయగా, కొందరు సప్తాశ్వరథంపై ఉన్న సూర్యుని విగ్రహం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం

సింహాచలం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామికి వైభవంగా ఆర్జితనిత్యకల్యాణోత్సవాన్ని నిర్వహించారు. వేకువన ప్రభాత సేవల తరువాత ఉత్సవమూర్తిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా తీర్చిదిద్దిన వేదికపై ఉంచారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కంకణధారణతో ప్రారంభించి అక్షితారోపణ వరకు కల్యాణ క్రతువును జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఉభయ దాతలకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

వంతెన వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్యే!

» మధురవాడ సర్వీసు రోడ్డులోని బ్రిడ్జి కింద నరకయాతన

» పలు ప్రాంతాలకు కూడలి కావడంతో అన్ని వేళల్లో రద్దీ



మధురవాడ వంతెన కింద నిలిచిపోయిన వాహనాలు (ఫైల్)

మధురవాడ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ సర్వీసు రోడ్డులో ఉన్న వంతెన కింద నిత్యం ట్రాఫిక్ సమస్యలతో వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డులో ఉన్న ఓ మార్టుకు రోజూ వేల సంఖ్యలో కొనుగోలుదారులు, పదుల వందల సంఖ్యలో వాహనాలు వస్తుంటాయి. ఆ రద్దీకి తగినట్లు సర్వీసు రోడ్డు లేకపోవడంతో వాహనచోదకులు తమ సమయమంతా ట్రాఫిక్‌లోనే గడపవలసి వస్తోంది.

మధురవాడ ఎత్తు వంతెన కింద నుంచే నగరంపాలెం, మల్లయ్యపాలెం, స్వతంత్రనగర్ కాలనీ, చంద్రంపాలెం, మిథిలాపురి వుడాకాలనీ తదితర ప్రాంతాలకు నిత్యం రాకపోకలు సాగుతుంటాయి. అలాగే బక్కన్నపాలెం, రేవళ్ళపాలెం, కొమ్మాది నవోదయ, కె-1 కాలనీకి కూడా ప్రజలు ఇదే మార్గంలో వెళుతుంటారు. ఇదే వంతెన కింద నుండే పీఎం పాలెం రత్నగిరి కాలనీ, లక్ష్మీవానిపాలెం, ఆర్‌హెచ్ కాలనీ తదితర ప్రాంతాలకు వాహనాలతో వెళుతుంటారు. ఈ క్రమంలో వంతెన కింద కూడా స్థలం సరిపడినంతగా లేకపోవడం, మరోవైపు రహదారి కూడా ఇరుకుగా ఉండడంతో వాహన వినియోగదారులకు ఈ రోడ్డులో వెళ్ళాలంటే చుక్కలు కనిపిస్తుంటాయి. ఈ రోడ్డులో పీఎం పాలెం పోలీసులు ట్రాఫిక్ నియంత్రిస్తున్నా పండుగలు, సెలవు రోజులు, సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉండడంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఒక్కోమారు కనీసం నడచి వెళ్ళడానికి కూడా దారి దొరకక పాదచారులు కష్టాలు పడుతుంటారు. ఎత్తు వంతెన కింద, మార్టు వద్ద పీఎం పాలెం పోలీసులు అదనపు సిబ్బందిని నియమించడం ఇక్కడ రోడ్ల విస్తరణకు చర్యలు తీసుకుంటే కొంత వరకు సమస్య పరిష్కారం అవుతుందని వాహనదారులు అంటున్నారు.

సిరుల దేవరకు సిరి సంపెంగల అర్చనలు



స్వర్ణ పుష్పాల నడుమ స్వామి వారు

సింహాచలం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : సిరుల దేవర సింహాచల వరాహ లక్ష్మీనృసింహానికి సిరి సంపెంగల అర్చనలు వైభవంగా నిర్వహించారు. ఆర్జిత సేవల్లో భాగంగా ఆదివారం వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా పూర్తి చేశారు. దేవాలయ పద్మనిధి (బాండాగారం) నుంచి సిరి సంపెంగలను (బంగారు సంపెంగ పుష్పాలను)తీసి బేడామండప ప్రదక్షిణ జరిపారు. ఉత్సమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో సర్వస్వర్ణాభరణాలతో శోభాయమానంగా తీర్చిదిద్ది ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతినామానికి ఒకటి చొప్పున సిరిసంపెంగలతో ప్రత్యేక అర్చనలు చేశారు. దేవదేవుడికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు అందజేశారు.

రుషికొండలో సందడే సందడి



సందర్శకులతో కిటకిటలాడుతున్న రుషికొండ తీరం

సాగర్‌నగర్, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్ ఆదివారం సందర్శకులతో సందడిగా కనిపించింది. ఒడిశా ఛత్తీస్‌ఘడ్, పశ్చిమ బెంగాల్, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి సందర్శకులు బీచ్ వద్ద ఎక్కువగా కనిపించారు.

సాగర్‌నగర్ సమీపంలోని ఇస్కాన్ మందిరాన్ని దర్శించుకుని అక్కడ నుంచి రుషికొండ టీటీడీ శ్రీవేంకటేశ్వర స్వామిఆలయంలోని శ్రీవారిని దర్శించుకొని రుషికొండ బీచ్‌కు అధిక సంఖ్యలో సందర్శకులు చేరుకుని సముద్రతీర అందాలను ఆస్వాదించారు. బీచ్‌లో ఇసుక తెన్నులపై సరదాగా గడిపారు. సముద్రం కెరటాల మధ్య ఆడుతూ ఉల్లాసంగా గడిపారు. దీంతో బీచ్‌రోడ్డు వాహనా రద్దీ, జనంతో తీర ప్రాంతాల్లో సందడి నెలకొంది.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

... 5వ పేజీ తరువాయి

పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షల పర్యవేక్షణకు 146 కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లను నియమించారు. అలాగే నాలుగు ఫ్లైయింగ్ స్క్వాడ్లు ఏర్పాటుచేశారు. పరీక్షా గదికి ఫోన్లు అనుమతించరు.

పకడ్బందీ ఏర్పాట్లు : బి.మురళీధర్, ఆర్ఐవో

ప్రాక్టికల్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. ల్యాబ్ పరికరాలు అందుబాటులో ఉన్న కళాశాలల్లోనే పరీక్షలు నిర్వహిస్తున్నాం.

ప్రతి గదిలో సీసీ కెమెరా ఏర్పాటు చేసి కార్యాలయానికి అనుసంధానం చేశాం. ఇక్కడ నుంచి సిబ్బంది మూల్యాంకనం, మార్కుల నమోదుతో సహా అన్నీ విషయాలు గమనిస్తారు.

కార్మికుల హక్కులను హరించొద్దు

» జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటశేషమ్మ



మద్దిలో న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొన్న కార్మికులు, యజమానులు



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటశేషమ్మ

పద్మనాభం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులు హరించకుండా, వారితో ఇటుకబట్టీ యజమానులు పని చేయించాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ సూచించారు. మద్ది గ్రామంలో ఆదివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్మికశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వెట్టిచాకిరీ నిర్మూలన దినోత్సవంలో ఆమె మాట్లాడారు. కార్మికులు, యజమానులు వారి అవసరాల మేరకు పనులు చేపడుతున్నా, కార్మికుల హక్కులను హరించే అధికారం యజమానులకు లేదన్నారు. అధిక పనిగంటలతో వారిని పని చేయించకూడదన్నారు. వలస కార్మికులను తీసుకువచ్చినప్పుడు వారికి కనీస విద్యావసతులు కల్పించాల్సిన బాధ్యత యజమానులదేనన్నారు. అలాగే కుటుంబ సభ్యులందరితో పని చేయించరాదన్నారు. కార్మికుల ఖాతాల్లోకి నేరుగా చెల్లింపులు జరగాలని, మధ్యవర్తుల ప్రమేయం ఉండరాదన్నారు. కార్మికశాఖ జిల్లా డిప్యూటీ కమిషనరు ఎం.సునీత మాట్లాడుతూ ఇటుక బట్టీ యజమానులు కొందరు లైసెన్సు లేని సర్దారుల ద్వారా కార్మికులను తీసుకురావడం వలన కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. కార్మిక చట్టాల మేరకు వారికి అన్ని వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి డివిజన్ ఏఎల్ఓ ప్రసాద్, సీఐ సీహెచ్ శ్రీధర్, ఇటుకబట్టీ యజమానుల సంఘం అధ్యక్షుడు పి.రామకృష్ణ పాల్గొన్నారు.

గ్రంథాలయం ప్రారంభం



గ్రంథాలయంలో మజ్జి శ్రీనివాసరావు తదితరులు

ఆనందపురం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తర్లువాడలో మజ్జి అప్పారావు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని భీమిలి నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పేదల కష్టసుఖాల్లో పాలు పంచుకుని నిత్యం ప్రజాసేవలో ఉండే అప్పారావు జ్ఞాపకార్థం గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆవరణలో ఏర్పాటు చేసిన అప్పారావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మెడికవర్ ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయగా సుమారు 500 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారు మూడు వేల మందికి అన్న సమారాధన ఏర్పాటుచేశారు. మాజీ శాసన సభ్యుడు కరణం ధర్మశ్రీ, నాయకులు మజ్జి వెంకటరావు, శారదా ప్రియాంక, కోరాడ వెంకటరావు, గంట్రెడ్డి శ్రీనివాస్, బంక సత్యనారాయణ, పాండ్రంకి శ్రీను పాల్గొన్నారు.

గీతం ఆధ్వర్యంలో బైదిబే 2025 కార్యక్రమం

సాగర్‌నగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఆధ్వర్యంలో ఆదివారం బీచ్‌రోడ్‌లో బైదిబే-2025 ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. భవిష్యత్ ఆర్కిటెక్టర్లకు ప్రేరణ, యువతలో సృజనాత్మకత పెంపునకు ఉద్దేశించిన కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ నృత్యాలు



చిన్నారుల నృత్య అభినయం

మధురవాడ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మధురవాడ శిల్పారామంలో నగరానికి చెందిన సిద్ధేంద్ర యోగి నాట్యాలయం కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు ఆహూతులను అలరించాయి. గణేష్ స్తుతితో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో భావన లోన.. బాహ్యమునందున.., బ్రహ్మమొక్కటే.. పరబ్రహ్మమొక్కటే.., ముద్దుగారే యశోద.., జగదానందకారక, జగడపుచనుముల.. తదితర కీర్తనలకు కళాకారులు అభినయించారు. ఈ కార్యక్రమంలో చరిష్మా, జస్విక, దీపిక, హన్విత, మన్విత, పావని, మోక్షిత, చిన్మయి, గుణ్విక తదితరులు పాల్గొన్నారు.

టీడీఆర్‌ల సమస్య పరిష్కరించండి

బీఆర్‌టీఎస్ బాధితుల నిరసన



బాధితులతో మాట్లాడుతున్న సీఈ శివప్రసాదరాజు

సింహాచలం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మహావిశాఖ 98వ వార్డు తొలిపావంచా నుంచి పాతఅడివివరం కూడలి వరకు బీఆర్‌టీఎస్ సింహాచల కారిడార్ ఫేజ్-2 నిర్వాసితులకు సంబంధించిన టీడీఆర్‌ల సమస్యకు పరిష్కారం చూపాలని బాధితులు డిమాండ్ చేశారు. కారిడార్ ఫేజ్-2 రెండో లేయర్ బీటీ రోడ్డు వేసేందుకు కాంట్రాక్టర్ సిద్ధం కాగా, విషయం తెలుసుకున్న బాధితులు రోడ్డు పనులు చేస్తున్న ప్రాంతానికి చేరుకుని పనుల వాహనాలను నిలువరించే యత్నం చేస్తూ తమ నిరసన తెలిపారు. కొంతసేపు బాధితులతో కాంట్రాక్టర్ వాగ్వాదానికి దిగారు. బాధితులు వెనక్కి తగ్గకపోవటంతో విషయాన్ని ఉన్నతాధికారులకు తెలుపగా జీవీఎంసీ చీఫ్ ఇంజినీర్ శివప్రసాదరావు అక్కడికి చేరుకున్నారు. బాధితుల తరఫున స్థానిక రాజకీయ నేతలు పాశర్ల ప్రసాద్, కర్రి అప్పలస్వామి, ఎర్రవరం బాబు, కొలుసు ఈశ్వరరావులు సీఈతో చర్చించారు. ఈ ప్రాజెక్టు పారంభించి ఏడాదిన్నర దాటినా నేటివరకు టీడీఆర్‌ల సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని, నాయకులు కూడా కలెక్టర్‌ను కలిసి పరిష్కరించుకోవాలని చెప్పి పనులను కొనసాగించారు.



రుషికొండలోని ఏ-1 గ్రాండ్‌లో భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు మనవడు విష్ణు (వెంకయ్యనాయుడు కుమార్తె దీపా వెంకట్ కుమారుడు), సాత్విక వివాహ రిసెప్షన్‌కు ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, పంచకర్ల రమేశ్‌బాబు, విష్ణుకుమార్‌రాజులతోపాటు మాజీ మంత్రి జానా రెడ్డి, పలువురు పారిశ్రామికవేత్తలు, అధికారులు హాజరయ్యారు.

- ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం

కబళించిన కెరటం

... 5వ పేజీ తరువాయి

మెరైన్ సీఐ సింహాద్రినాయుడు, ఎస్ఐ నాగేంద్రలు సిబ్బందితో కలిసి వాడపాలెం సముద్రతీరం వద్దకు చేరుకున్నారు.

సూర్యతేజ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆసుపత్రికి తరలించారు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ నరసింగరావు తెలిపారు. కాగా సూర్యతేజ మృతదేహం వద్ద అతని తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు పలువురిని కలచివేసింది.

పై సంఘటనతో కొత్తపేట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

హైదరాబాద్, విజయవాడలకు 12 ప్రత్యేక బస్సులు

» ఎల్‌టీటీతో పాటు మరో రెండు రైళ్లు రద్దవడంతో ఆర్టీసీకి పెరిగిన తాకిడి

ద్వారకా బస్‌స్టేషన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం ఆదివారం హైదరాబాద్ 5, విజయవాడ 7 ప్రత్యేక బస్సులను నడిపింది. ఎల్‌టీటీతో పాటు మరో రెండు రైళ్లు రద్దు కావడంతో హైదరాబాద్, విజయవాడ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఆర్టీసీ బస్సులను ఆశ్రయించారు. దీంతో ఆ రెండు ప్రాంతాలకు మధ్యాహ్నం నుంచి ప్రత్యేక సర్వీస్‌లను నడిపారు. సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్ వంటి సర్వీస్‌లను ఆయా ప్రాంతాలకు ఆపరేట్ చేశారు.

రాత్రి తొమ్మిది గంటల సమయానికి 12 ప్రత్యేక సర్వీస్‌లను నడిపినట్టు అధికారులు తెలిపారు. ప్రయాణికుల డిమాండ్ ఇంకా అధికంగా ఉంటే అందుకు తగ్గట్టుగా రాత్రి కూడా ప్రత్యేక బస్సులు నడుపుతామని ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు.

సోమవారం కూడా ప్రత్యేక బస్సులు నడిపే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

క్రైమ్ రేటు పెరిగితే ఉపేక్షించేది లేదు

... 5వ పేజీ తరువాయి

వేసేందుకు అమలుచేస్తున్న వ్యూహాలను సీపీ శంఖబ్రతబాగ్చి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డీజీపీకి వివరించారు. అనంతరం డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా మాట్లాడుతూ అత్యంత ప్రాముఖ్యత కలిగిన విశాఖ నగరంలో పోలీసింగ్‌ను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్, మత్తుమందుల రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. రౌడీయిజం, భూకబ్జాలకు తావులేకుండా ముందస్తు వ్యూహాలను రచించి అమలు చేయాలన్నారు. అనంతరం శాఖాపరంగా ఉన్న సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని డీజీపీ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో డీసీపీ-1 అజితా వేజెండ్ల, డీసీపీ-2 మేరీ ప్రశాంతి, అడ్మిన్ డీసీపీ, ఏడీసీపీలు, ఏసీపీలు, సీఐలు పాల్గొన్నారు.

క్రెబ్స్‌పై కొరడా

... 5వ పేజీ తరువాయి

చాలాకాలంగా ఫిర్యాదులు ఉన్నాయి. కంపెనీ నుంచి వచ్చే దుర్గంధంతో సమీపంలోని కేజీబీవీ పాఠశాల, తేగాడలో మోడల్ స్కూల్ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

కంపెనీ నుంచి వచ్చే వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా శారదా నదిలోకి విడిచిపెట్టడం, కంపెనీని ఆనుకుని గొయ్యిలో నింపడం చేస్తున్నారు. దీంతో భూగర్భ జలాలు కలుషితం కావడంతో కంపెనీ సమీపంలోని గంటవానిపాలెం గ్రామస్థులు గతంలో ఆందోళనలు చేసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పీసీబీ అధికారులు తనిఖీలు చేసి 2023 డిసెంబరులో ఒకసారి కంపెనీని మూసివేయాలని ఆదేశించారు. తరువాత పీసీబీ నిబంధనల మేరకు కంపెనీ కొన్ని దిద్దుబాటు చర్యలు తీసుకోవడంతో గత ఏడాది జనవరిలో తిరిగి ఉత్పత్తి ప్రారంభించడానికి అనుమతించారు.

తాజాగా కంపెనీ నుంచి వ్యర్థాలు విజయవాడ రూరల్‌లోని జక్కంపూడిలో పారబోయడంతో విచారణ జరిపిన పీసీబీ మరోసారి మూసివేతకు ఆదేశాలు ఇచ్చింది.

పూర్ణామార్కెట్ వద్ద ఆక్రమణల తొలగింపునకు నేతల మోకాలడ్డు

... 5వ పేజీ తరువాయి

వన్‌టౌన్ ట్రాఫిక్ పోలీసులను వెంట తీసుకుని పూర్ణామార్కెట్‌కు వెళ్లి ఆశీల్ వసూళ్లపై స్వయంగా వ్యాపారులను ఆరాతీశారు. గెజిట్ కంటే పది రెట్లు ఎక్కువ వసూలు చేస్తున్నట్టు నిర్ధారణ కావడంతో కాంట్రాక్టర్‌కు నోటీసు జారీ చేయాలని రెవెన్యూ విభాగం అధికారులను ఆదేశించారు.

అలాగే రోడ్డును ఆక్రమించి ఏర్పాటుచేసిన దుకాణాలను శుక్రవారం మధ్యాహ్నం మూడున్నర గంటల్లోగా తొలగించాలని, లేనిపక్షంలో తామే వాహనాలను తీసుకొచ్చి తీసుకువెళ్లిపోతామని హెచ్చరించారు. అనుకున్నట్టుగానే శుక్రవారం మధ్యాహ్నం మూడున్నర గంటలకు జీవీఎంసీ, పోలీస్ అధికారులు పూర్ణామార్కెట్ మెయిన్‌రోడ్డుకు చేరుకున్నారు. వారిని చూసి కొంతమంది వ్యాపారులు స్వచ్ఛందంగానే దుకాణాలను తొలగించారు. మరికొందరు మాత్రం తమ వ్యాపారాన్ని కొనసాగించారు. ఇంతలో ఏమైందో తెలియదుగానీ దుకాణాల జోలికి వెళ్లకుండానే జీవీఎంసీ, పోలీస్ అధికారులు అక్కడి నుంచి వెనుతిరిగారు. దాంతో రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు కొనసాగడంతోపాటు, ఆశీల్ వసూళ్లు కూడా గతంలో మాదిరిగానే జరుగుతోంది. రాజకీయ నేతల నుంచి ఒత్తిళ్లు రావడం వల్లే దుకాణాలను తొలగించాలని సిద్ధపడిన అధికారులు వెనుతిరిగారని పూర్ణామార్కెట్‌లోని వ్యాపారులు చర్చించుకుంటున్నారు.

విదేశీ ఉద్యోగాల పేరిట వల

... 5వ పేజీ తరువాయి

చేసుకుని కాలం వెళ్లదీస్తున్నారు. తాము తిరిగి ఇండియా వెళ్లిపోతామని ఎవరైనా అంటే మాత్రం వారిని అక్కడే వదిలేసి ఏజెంట్లు చేతులు దులిపేసుకుంటున్నారు. తర్వాత వారు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించరు. విదేశాల్లో వీసా లేకుండా బయటకు వెళ్లలేని పరిస్థితి కావడంతో వారిపై అక్కడ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు కూడా బాధితులకు అవకాశం ఉండడం లేదు.

గాజువాకకు చెందిన ఒక ఏజెన్సీ షార్జాలో వెల్డర్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ గత ఏడాది అక్టోబరులో ప్రకటన ఇచ్చింది. దానిని చూసి పెదగంట్యాడ ప్రాంతానికి చెందిన గెద్దాడ లోకేశ్‌తోపాటు అనకాపల్లి జిల్లాకు చెందిన పోలుపర్తి లక్ష్మణరావు, గార రాజేశ్, పైలా రామస్వామి, శ్రీకాకుళం జిల్లాకు చెందిన కాళ్ల వెంకటరావులుఆ ఏజెన్సీని సంప్రదించారు. అందుకు కావాల్సిన శిక్షణ ఇవ్వడంతోపాటు విమాన టికెట్లు, వీసా కల్పించే బాధ్యత తమదేనంటూ నమ్మించి ఒక్కొక్కరి నుంచి రూ.రెండు లక్షల నుంచి రూ.మూడు లక్షలు వసూలు చేసింది. అనంతరం వారికి గాజువాక ఆటోనగర్‌లో వెల్డింగ్‌లో శిక్షణ ఇప్పించింది. గత ఏడాది డిసెంబరులో వారిని విజిటింగ్ వీసా మీద షార్జా పంపించారు. షార్జా ఎయిర్‌పోర్టులో తమ ఏజెంట్ వచ్చి రిసీవ్ చేసుకుంటారని వారికి చెప్పారు. అక్కడ ఎయిర్‌పోర్టులో దిగగానే వారిని ఒక ఏజెంట్ రిసీవ్ చేసుకున్నారు. ఉద్యోగం రావాలంటే కంపెనీ పరీక్ష పెడుతుందని, అందులో పాస్ అయితేనే వెల్డర్ ఉద్యోగం వస్తుందని చెప్పారు. అక్కడ ఏదో పరీక్ష పెట్టి ఫెయిలైనందున హెల్పర్ ఉద్యోగాలు చేయాలని చెప్పారు. అందుకు ఐదుగురు యువకులు అంగీకరించకపోవడంతో...అయితే తిరిగి వెళ్లిపోవచ్చునన్నారు. తమ పాస్‌పోర్టులు ఇచ్చేసి, టిక్కెట్ ఇస్తే వెళ్లిపోతామని చెప్పగా, వారం రోజులు ఉంటే వీసా, టికెట్‌లు ఇస్తామని చెప్పి... ఏజెంట్ వెళ్లిపోయారు. ఇరవై రోజులు గడిచినా అక్కడ ఏజెంట్ రాకపోవడం, గాజువాకలోని ఏజెన్సీకి ఫోన్ చేస్తే స్పందించకపోవడంతో ఐదుగురు యువకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చివరకు సీపీ శంఖబ్రతబాగ్చికి వాట్సాప్ కాల్ చేసి తమ పరిస్థితి వివరించడంతో సీపీ చొరవ తీసుకుని, వారిని పంపించిన ఏజెన్సీ ప్రతినిధులను గుర్తించారు. వారితోనే షార్జా నుంచి ఇండియాకు విమానం టికెట్లు తీయించి ఐదుగురు యువకులను గత నెల 22న నగరానికి తీసుకొచ్చారు. ఇలా ఎంతోమంది విదేశాల్లో ఉద్యోగాలనే ఆశతో వెళ్లి అక్కడ అక్రమ వలసదారులుగా బందీలుగా ఉండిపోతున్నారు.

అన్నీ పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలి

- సీపీ శంఖబ్రతబాగ్చి

విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తామని ఎవరైనా చెబితే అన్నివిధాలుగా పరిశీలించుకోవాలి. ఏజెన్సీలు, ఏజెంట్లతోపాటు వారు చెప్పే కంపెనీలకుసంబంధించిన వివరాలు, ప్రభుత్వ అనుమతులువంటివాటి కోసం ప్రభుత్వ పోర్టల్‌లో తనిఖీ చేయాలి. ఆయా సంస్థలు, ఏజెన్సీల ద్వారా గతంలో ఎవరైనా వెళ్లి ఉద్యోగాలు చేస్తుంటే వారితోపాటు వారి కుటుంబసభ్యులతో కూడా ఆయా సంస్థల గురించి ఆరా తీయాలి. ఏ మాత్రం అనుమానం కలిగినా, ప్రభుత్వ గుర్తింపులేని ఏజెన్సీ అని తేలినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. నగరంలో ఈ తరహా మోసాలు పెరుగుతుండడంతో ఏయూలోని అధ్యాపకులతో ఒక కమిటీ వేసి ఏజెన్సీలపై అధ్యయనం చేయించాలని యోచిస్తున్నాం.



శ్రీధర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న రాజేశ్ పెందార్కర్

ఈఎన్‌సీని సందర్శించిన ఎయిర్ మార్షల్

విశాఖపట్నం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎయిర్ మార్షల్ (మెడికల్) ఎంఎస్ శ్రీధర్ ఆదివారం తూర్పు నావికాదళాన్ని సందర్శించారు. ఈఎన్‌సీ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెందార్కర్ ఆహ్వానం మేరకు ఆయన ఇక్కడకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఇరువురు ఉన్నతాధికారులు కాసేపు వివిధ అంశాలపై మాట్లాడుకున్నారు. మెడికల్ సౌకర్యాలపై చర్చించారు. అత్యవసర రోగులకు లైవ్ రేడియేషన్ విధానాన్ని డ్రిల్ రూపంలో ఎయిర్ మార్షల్ చూపించారు. అనంతరం శ్రీధర్‌కు రాజేశ్ పెందార్కర్ జ్ఞాపికను అందజేశారు.

సినిమా గైడ్

- **తండేల్ :** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ),
- **భవానీ వార్డ్ :** జగదాంబ, రమాదేవి
- **మదగజరాజ :** జగదాంబ, వెంకటేశ్వర-1, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),
- **సంక్రాంతికి వస్తున్నాం :** శారద, మెలోడి, జగదాంబ, కిన్నెర, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, శ్రీకన్య, కిన్నెర, సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ,కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 14, వంకాయలు (తెలుపు) 16, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 42, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 42, బీరకాయలు 50, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 12, క్యాబేజి 12, క్యారెట్ 26 దొండకాయలు 32, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది)40, బరబాటి 30, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 62, బద్దచిక్కుడు 26, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 170, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 40, కీరదోస 26, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 38, కంద 56, దేముడు చిక్కుడు 28, గోరు చిక్కుడు 28, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 25, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	90
లైవ్ ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200

నేడు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ

- తమ పిల్లలతో తప్పనిసరిగా మాత్రలు వేయించాలి
- డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

విశాఖపట్నం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా సోమవారం నులిపురుగుల నిర్మూలనకు గాను ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నారు. జిల్లాలో ఒకటి నుంచి 19 ఏళ్లలోపు చిన్నారులకు ఈ మాత్రలను పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల చిన్నారులకు ఈ మాత్రలను అందించ నున్నారు. జిల్లాలో ఏడాది నుంచి 19 ఏళ్లలోపు వయసు గల చిన్నారులు 5,20,891 మంది ఉన్నట్టు అధికారులు గుర్తించారు. వీరిలో ఏడాది నుంచి రెండేళ్లలోపు వయ సున్న పిల్లలకు సగం మాత్రను నీటిలో కరిగించి తాగించనున్నారు. రెండు నుంచి మూడేళ్లలోపు చిన్నారులకు పూర్తి మాత్రను నీటిలో కరిగించి తాగించాల్సి ఉంటుంది. మూడు నుంచి 19 ఏళ్లలోపు వారు మాత్రను చంపరించి వేసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సిబ్బందికి తగిన సూచనలు చేశామన్నారు. మధ్యాహ్నం భోజనం చేసిన అరగంట తర్వాత మాత్రలు వేయించేలా ఆదేశాలు జారీ చేశారు.

సోమవారం, ఈ నెల 17న మాప్ అప్ రౌండ్ కార్యక్రమంలో భాగంగా తప్పకుండా అందరూ మాత్రలు వేసుకోవాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ మాత్రల పంపిణీలో విద్యాశాఖ, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, ఇతర శాఖల సహకారాన్ని తీసుకుంటున్నామన్నారు. తల్లిదండ్రులు తప్పని సరిగా చిన్నారులు మాత్రలు తీసుకునేలా చూడాలని డీఎంహెచ్‌వో కోరారు. పిల్లలకు నులిపురుగులు మాత్రలు ఇవ్వకపోవడం వల్ల కడుపు నొప్పి, రక్తహీనత వంటి సమస్యలతో బాధపడాల్సి వస్తుందని పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సుల నిర్వహణ పటిష్ఠంగా ఉండాలి

- విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు



సిబ్బందికి సూచనలిస్తున్న అప్పలనాయుడు

ద్వారకాబస్‌స్టేషన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు రవాణా సేవలు అందించే ఆర్టీసీ బస్సుల నిర్వాహణ పటిష్ఠంగా ఉండాలని, ఏ చిన్న లోపం ఉన్నా భారీ మూల్యం చెల్లించుకోవలని వస్తుందని విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు అన్నారు. విశాఖపట్నం ఆర్టీసీ డిపోను, గ్యారేజీని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్యారేజీలో సాంకేతిక సిబ్బందితో సమావేశమై వారికి పలు సూచనలు చేశారు. ప్రయాణికులకు ఆర్టీసీపై ఎంతో నమ్మకం ఉందని, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తే సురక్షితంగా, సౌకర్యవంతంగా సకాలంలో గమ్యానికి చేరుకోగలమని విశ్వసిస్తున్నారన్నారు. బస్సులకు సాంకేతిక లోపాలు తలెత్తి మార్గమధ్యంలో నిలిచి పోయినా, బస్సుల్లో కుదుపులు ఏర్పడినా, సీట్లు సౌకర్యవంతంగా లేకపోయినా, కిటికీలకు అద్దాలు లేకపోవడం వంటి సమస్యల వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. అందువల్ల అటువంటి సమస్యలేవీ బస్సుల్లో లేకుండా చూడాలని ఆర్ఎం సూచించారు. సమావేశంలో డిపో అధికారులు, గ్యారేజీ మెకానిక్‌లు పాల్గొన్నారు.

ఎన్ఎంయూఏ రీజనల్ అధ్యక్ష, కార్యదర్శులుగా మూర్తి, శంకరరావు



మూర్తి, శంకరరావులను అభినందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ద్వారకాబస్‌స్టేషన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) రీజనల్ అధ్యక్షునిగా పీఎస్ మూర్తి, కార్యదర్శిగా పి.శంకరరావు ఎన్నికయ్యారు. వాల్తేరు డిపో ఎన్ఎంయూఏ కార్యాలయంలో ఆదివారం జరిగిన రీజనల్ మహా సభలో వీరిరువురూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్ఎంయూఏ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి మాట్లాడుతూ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం నిరంతరం కార్మికుల సంక్షేమానికే కృషి చేస్తుందన్నారు. రాగద్వేషాలకు అతీతంగా నాయకులు చిత్తశుద్ధితో పని చేస్తున్నారన్నారు. జోనల్ కార్యదర్శి ఎంవీఆర్ మూర్తి మాట్లాడుతూ ఆర్టీసీలో అతి పెద్ద అసోసియేషన్‌గా ఏర్పడి కార్మికుల పక్షాన నిలిచి వారి సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నామన్నారు. సమావేశంలో రాష్ట్ర కోశాధికారి పీవీవీ మోహన్, కార్యదర్శులు వి.అప్పారావు, జీఆర్ రావు, నాయకులు వి.ప్రదీప్‌కుమార్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం హైస్కూల్ విద్యార్థుల అ'పూర్వ' కలయిక



తీపి గురుతుగా గ్రూప్ ఫొటో దిగిన పూర్వ విద్యార్థులు

వేపగుంట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 93వ వార్డు పరిధి శ్రీనివాసనగర్ తోటలో ఆదివారం గోపాలపట్నం హైస్కూల్‌లో పదో తరగతి చదివిన 1992-93 పూర్వ విద్యార్థుల ఆపూర్వ కలయిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నాటి జ్ఞాపకాలను నెమరవే సుకుంటూ అందరూ ఉల్లాసంగా.. ఉత్సా హంగా గడిపారు. ఒకరికొకరు యోగ క్షేమాలు, ఉద్యోగాలు, పిల్లలు, వారి చదు వులు, పెళ్లిళ్ల గురించి అడిగి తెలుసు కున్నారు. అనంతరం ఆటపాటలతో ఎంజాయ్ చేశారు. ఈ సందర్భంగా తమ బ్యాచ్‌లో ఎవరికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా సమష్టిగా సహాయ సహకారాలు అందించాలని నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బెంజిమెన్, కాకి వరప్రసాద్‌రెడ్డి, రాజశేఖర్, పీఏ రాజు, ప్రకాశ్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



గాజువాక ప్రధాన డ్రైనేజీకి జరుగుతున్న అభివృద్ధి పనులు

చకచకా డ్రైనేజీల అభివృద్ధి పనులు

- వేసవిలోగా పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించిన అధికారులు
- అందుబాటులోకి వస్తే ముంపు సమస్య తీరినట్టే..

గాజువాక, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గాజువాక నియోజకవర్గ పరిధిలో జీర్ణావస్థకు చేరుకున్న ప్రధాన డ్రైనేజీల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇందుకోసం కోట్లాది రూపాయల నిధులను అధికారులు వెచ్చిస్తున్నారు. గాజువాక నుంచి గంగవరం పోర్టు వరకు ఉన్న ఉన్న సుమారు ఎనిమిది కిలోమీటర్ల ప్రధాన డ్రైనేజీకి ఉన్న రిటెయినింగ్ వాల్స్ పలుచోట్ల మొత్తం శిథిలమయ్యాయి. ఈ కారణంగా వర్షాలు కురిస్తే చాలు డ్రైనేజీ పొడవునా ఇరువైపులా ఉన్న పలు కాలనీల్లోకి నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు.

కాలనీల ముంపు సమస్యను గుర్తించిన అధికారులు ప్రధాన డ్రైనేజీని పునర్నిర్మించాలని నిర్ణయించారు. ఈ డ్రైనేజీ పరిధిలో ఎక్కడెక్కడ రిటెయినింగ్ వాల్స్ లేవు, ఏ ఏ ప్రాంతాల్లో డ్రైనేజీ ఎత్తు తక్కువగా ఉందో నిర్ధారించేందుకు ముందుగా ప్రత్యేక బృందం సర్వే చేసింది. దీని ప్రకారం ప్రస్తుతం ఆయా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వేసవిలోగా ప్రధాన డ్రైనేజీలకు అభివృద్ధి పనులు చేపడితే ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని అధికారులు త్వరితగతిన పనులు పూర్తయ్యేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. గాజువాకకు సంబంధించిన పలు వార్డుల మురుగు నీరు, వర్షపు నీరు ఈ ప్రధాన డ్రైనేజీ గుండా నేరుగా సముద్రంలో కలుస్తుంది. అందువల్ల డ్రైనేజీని ఎంతో పటిష్ఠంగా నిర్మించేందుకు అధికారులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. అదేవిధంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న డ్రైనేజీల పనులు శరవేగంగా జనుగుతున్నాయి. ఈ డ్రైనేజీల అభివృద్ధి పనులు పూర్తయితే పలు లోతట్టు ప్రాంతాలకు ముంపు సమస్య పూర్తి స్థాయిలో తీరినట్టవుతుంది.

పైడిమాంబ పరస రేపు



ఎస్.ఎ.డీజం క్షన్ ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరాజుపాలెం పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దేవత శ్రీపైడి మాంబ పరసను ఈ నెల 11న ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం అమ్మవారికి నేత్ర దర్శన పూజలు చేశారు. పరస దృష్ట్యా ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయానికి రంగులు వేసిన ఉల్లూరి పరమేశ్వరరావును గ్రామస్తులు, పండగ నిర్వహణ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పి.ప్రకాశ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ మళ్ల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



యారాడ తీరంలో సినిమా షూటింగ్ జరుగుతున్న దృశ్యం

యారాడ సాగర తీరంలో 'మానస చోర' సందడి

సింధియా, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): యారాడ సాగర తీరంలో ఆదివారం 'మానస చోర' అనే సినిమాకు సంబంధించిన పలు సన్నివేశాలను చిత్రీకరించారు. ప్రేమ, కుటుంబ అంశాలతో ఈ సినిమాను తీస్తున్నట్టు చిత్ర దర్శక, నిర్మాత, హీరో కిరణ్‌కుమార్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన తనకు ఇదే తొలి చిత్రమన్నారు. హీరోయిన్‌గా కొత్త అమ్మాయి ఖహీన్ ఖాన్ (ముంబై) నటిస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే ఆంధ్రాలోని పలు పర్యాటక ప్రాంతాల్లో ఈ చిత్రానికి సంబంధించి షూటింగ్ చేశామని, యారాడలో నాలుగు రోజుల పాటు పలు కీలన సన్నివేశాలను చిత్రీకరిస్తామని కిరణ్‌కుమార్ తెలిపారు. కాగా యారాడలో మరోపక్క విజయ దేవరకొండ హీరోగా నటిస్తున్న ఓ సినిమాకు సంబంధించి భారీ సెట్టింగ్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

ధ్యానం, సంగీతం రెండూ ఒక్కటే..

పెందుర్తి-రూరల్, ఫిబ్రవరి 9: ధ్యానం, సంగీతం ఈ రెండూ ఒక్కటేనని, రెండింటిలోనూ ఆధ్యాత్మికత, ఆరోగ్యం మిలితమై ఉన్నాయని అంతర్జాతీయ సంగీత విద్వాంసుడు స్వరవీణాపాణి అన్నారు. 95వ వార్డు పరిధి పాపయ్యరాజుపాలెంలోని బ్రహ్మర్షి పిరమిడ్ శక్తి క్షేత్రంలో నిర్వహిస్తున్న త్యాగరాజ ఆరోధనోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన సంగీత కచేరీకి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సంగీతం అనంతమైనదని, ఇందులో ప్రయోగాలకు కొదవ లేదన్నారు. సరిగమ పద నిసలతో శ్రీకారం చుట్టే సంగీతంలో 12 రాగాలు, 32 ఉప రాగాలు, 72 మేల కర్త రాగాలు ఉన్నాయన్నారు. సంగీతంలో తనకున్న ప్రవేశాన్ని ప్రపంచ వ్యాప్తంగా పరిచయం చేయడమే తన కర్తవ్యమన్నారు. వాట్సాప్ ద్వారా అందరినీ సంగీత సాధకులుగా చేయడానికి కృషి చేస్తానన్నారు. అనంతరం స్వరవీణాపణి కుటుంబ సభ్యులతో పాటు మృదంగ కళాకారుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావును పిరమిడ్ కళాకారులు సత్కరించారు. స్వరవీణాపాణి ఆలపించిన కీర్తనలు అలరించాయి. కార్యక్రమంలో పిరమిడ్ ప్రతినిధులు ఈశ్వరమ్మ, ఆత్మానందం, జ్యోతి, కామేశ్వరరావ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నామినేషన్లకు నేడు చివరి రోజు

విశాఖపట్నం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడానికి సోమవారంతో గడువు ముగియనున్నది. ఈ నెల మూడో తేదీ నుంచి నామినేషన్లను స్వీకరిస్తున్నారు. శుక్రవారం వరకు ఎనిమిది మంది 14 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. నామినేషన్లను 11వ తేదీన పరిశీలిస్తారు. 13వ తేదీ ఉపసంహరణకు గడువిచ్చారు. కాగా ఈ నెల 27వ తేదీన ఎన్నికలు జరుగుతాయి.

బీచ్‌కు పోటెత్తిన సందర్శకులు



ఆర్కే బీచ్‌కు ఆదివారం సందర్శకులు పోటెత్తారు. కొందరు సముద్ర తీరంలో స్నానాలు చేస్తూ, ఫొటోలు దిగుతూ సందడి చేశారు. మరికొందరు ఇసుక తిన్నెలపై కూర్చుని వాతావరణాన్ని ఆస్వాదించారు.

ప్రకృతి ఆధారిత పంటలతో ఆరోగ్యం

మల్కాపురం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి ఆధారిత పంటలే ఆరోగ్యమని సంరక్షిత సంస్థ అధ్యక్షురాలు షీలా జైన్ పేర్కొన్నారు. మల్కాపురం సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్‌లో ఆదివారం గ్రీన్ క్లైమేట్ జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అందరూ ఇళ్ల వద్దే మొక్కలు నాటి కాయగూరలను పండించుకోవాలన్నారు. మిద్దె తోటలు, ఇంటి దగ్గర కూరగాయులు, ఆకుకూరలు, పండ్లను పండించుకుని వాటిని వినియోగిస్తే ఆరోగ్యవంతులుగా ఉండవచ్చునన్నారు. అనంతరం గ్రీన్ క్లైమేట్ నిర్వాహకులు పలు రకాల మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ ఏఎస్ఐ సయ్యద్, డిప్యూటీ కమాండెంట్ డి.రిషబ్, గ్రీన్ క్లైమేట్ టీమ్ ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, రమాదేవీ, తదితరులు పాల్గొన్నారు. డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

మహా శివరాత్రి ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ

అగనంపూడి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక ఉమామహేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, తదితరులు ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. తొలుత స్వామివారిని పల్లా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు కర్రి దశేంద్ర, నాయకులు మోటూరి వెంకటరమణ, నెల్లి శ్రీను, వి.చిరురాజు, జి.అప్పారావు, మజ్జి శ్రీను, రాము, కరణం సన్నీ, లోవరాజు, తదితరులు పాల్గొన్నారు.

విజిటింగ్ స్పెషలిస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ జనరల్ ఆస్పత్రిలో విజిటింగ్ స్పెషలిస్టుల కోసం ఉక్కు యాజమాన్యం ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆస్పత్రిలో ఇద్దరు జనరల్ మెడిషన్ వైద్యులను నియమించనున్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. పూర్తి చేసిన దరఖాస్తులను స్టీల్ ప్లాంట్ జీఎం (మెడికల్)కు పంపాలని, మరిన్ని వివరాలకు www.vizagsteel.com వైబ్‌సైట్‌ను సంప్రదించాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

ఘనంగా రజకుల బల్లల పండగ

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రజకులు తమ సమస్యల పరిష్కారానికి గాను పార్టీలకతీతంగా ఉండాలని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి అన్నారు. తుంగ్లాం రజకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం తుంగ్లాంలో బల్లల పండగను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రజకుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వినియోగించుకోవాలని కోరారు. సంఘ నాయకులు అప్పారావు, కనకరాజు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ పోర్టుకు విచ్చేసిన జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్



కిశోర్ మక్వానాకు స్వాగతం పలుకుతున్న పోర్టు అధికారులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిశోర్ మక్వానా ఆదివారం తమ బృందంతో కలిసి విశాఖ పోర్టు అథారిటీని సందర్శించారు. పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్, డిప్యూటీ కన్జర్వేటర్ టి.శ్రీనివాస్‌లు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అధికారులు పోర్టు ఆధునికీకరణ, దిగుమతులు, ఎగుమతులు, వ్యాపార అవకాశాలపై సమగ్ర సమాచారాన్ని కిశోర్ మక్వానాకు వివరించారు. పోర్టు సామర్థ్యాన్ని పెంచేందుకు తీసుకుంటున్న చర్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా కిశోర్ మక్వానా మాట్లాడుతూ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతున్న వాణిజ్య హబ్‌గా పోర్టును ప్రశంసించారు.

ఉక్కు ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్ డిమాండ్ లెటర్లు జారీ

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఉద్యోగులు, ఉద్యోగుల హయ్యర్ పెన్షన్ విషయంలో డిమాండ్ లెటర్ల జారీ ప్రక్రియ ప్రారంభమైంది. ప్లాంటుకు చెందిన సుమారు 480 మంది ఉద్యోగులకు, పదవీ విరమణ ఉద్యోగులకు డిమాండ్ నోటీసులు జారీ చేశారు. ఇందులో ఉద్యోగి, పదవీ విరమణ ఉద్యోగి కట్టాల్సిన నగదును పొందుపరిచారు. అదే లింక్‌లో పెన్షన్ కాలిక్యులేటర్‌ను కూడా అందుబాటులో ఉంచారు. ఉద్యోగులు తమకు ఎంత పెన్షన్ వసుందో తెలుసుకునే అవకాశం ఉంది. హయ్యర్ పెన్షన్‌కు దరఖాస్తు చేసిన ఉద్యోగులంతా ఈపీఎఫ్‌వో వెబ్‌సైట్‌లో హయ్యర్ పెన్షన్ స్టేటస్‌లో తనిఖీ చేసి డిమాండ్ లెటర్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

విండ్ బాల్ క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న రాము

అగనంపూడి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): లక్కరాజుపాలెం సఖ్యత యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విండ్ బాల్ క్రికెట్ పోటీలను జనసేన పార్టీ నాయకుడు దుల్ల రామునాయుడు ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడారు. నేటి పోటీ ప్రపంచంలో ఒత్తిడిలో ఉన్న యువతకు ఇటువంటి పోటీలు మానసికంగా ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. ఈ పోటీల్లో 16 జట్లు పాల్గొంటున్నాయని, విజేతలకు 13వ తేదీన బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు విందుల చిరురాజు, సంఘం ప్రతినిధులు లక్కరాజు వెంకటేష్, శివ కుమార్, వెంకటరావు, పులస్‌కుమార్, సూరి బాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పరీక్షపే చర్చ ప్రత్యక్ష ప్రసారం

కేవీలో ఎల్‌ఈడీ స్ర్కీన్ ఏర్పాటు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు మద్దతుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరీక్ష పే చర్చ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 11 గంటలకు ముస్లిం తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయం వాల్తేరులో వీక్షించేందుకు ఎల్‌ఈడీ స్ర్కీన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ కమల్‌జిత్ తెలిపారు. ఈ ఏడాది పరీక్షల సందర్భంగా ఆహారం, పోషణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంపై చర్చ ఉంటుందని చెప్పారు. ఈ ప్రత్యక్ష ప్రసారాన్ని డీడీ, యూట్యూబ్, ప్రధాన వార్తా చానళ్ల వంటి వివిధ ప్లాట్‌ఫాంలలో అందుబాటులో ఉంచుతామన్నారు. దీనిద్వారా దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు విలువైన సలహాలు, సూచనలు పొందాలని కోరారు. ప్రసార సమయంలో పరీక్షల సందర్భంగా ప్రధాని మోదీ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను, జీవనశైలిని ఎలా కాపాడుకోవాలో విలువైన సూచనలు, చిట్కాలను పంచుకుంటారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

స్టార్ కిడ్స్ విజేతగా నందన్ తేజ్



స్టార్ కిడ్స్ టైటిల్‌ను అందుకుంటున్న నందన్ తేజ్

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): స్టార్ కిడ్స్ ఫ్యాషన్ షో-2025లో నగరంలోని డాబాగార్డెన్స్‌కు చెందిన ఉప్పల వి.ఎస్.నందన్ తేజ్ ప్రతిభ చాటాడు. చైతన్య టెక్నో స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్న నందన్ తేజ్ ప్రిన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ టైటిల్ గెలుచుకుని గుర్తింపు తెచ్చుకున్నాడు. నగరంలో మూడు రోజులు నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో 68 మంది పాల్గొన్నారు. అనేక ఫ్యాషన్ రౌండ్స్, టాలెంట్ టెస్ట్‌లో తేజ్ తన ప్రత్యేకత నిరూపించుకున్నాడు. తల్లిదండ్రులు వి.వెంకటరావు, వి.హరిత ప్రోత్సాహంతో టైటిల్ గెలుచుకున్నానని, శిక్షణ ఇచ్చిన అందరికీ నందన్ తేజ్ కృతజ్ఞతలు తెలియజేశాడు.

భక్తిశ్రద్ధలతో మూడు పీఠాల పండగ



ప్రదర్శనగా వస్తున్న చిన్నారులు, విశ్వాసులు

జ్ఞానాపురం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ ప్రధాన దేవాలయంలో ఆదివారం మూడు పీఠాల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ అగ్ర పీఠాధిపతులు బిషప్ డాక్టర్ పొలిమేర జయరావు ప్రసంగించారు. క్రీస్తు ప్రభువు ఇహలోకం నుంచి పరలోకానికి వెళ్లే సమయంలో తాను మానవాళి మధ్య సజీవంగా ఉండేందుకు గుర్తుగా రొట్టె,ద్రాక్ష రసాన్ని భుజించమని చెప్పారన్నారు. దివ్యపూజ బలిలో సుమారు 100 మంది చిన్నారులకు క్రీస్తు ప్రభువు అంశ ఉండే సత్ ప్రసాదాన్ని అందించారు. అనంతరం జ్ఞానాపురంలోని వడచర్లవీధి, స్లీవ్ గుర్తు వీధి, పునీత పేతురు ప్రధాన దేవాలయం వరకు విశ్వాసులు, చిన్నారులు ప్రదక్షిణ నిర్వహించి పీఠాల వద్ద దివ్య సత్ ప్రసాద్ ఆరాధన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో జరిపారు. విచారణ కర్తలు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్, పీసీసీ సభ్యులు పాల్గొన్నారు.

నేర కార్యకలాపాల్లో పాల్గొంటే పీడీ చట్టం



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న సీఐ

సీతమ్మధార, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇబ్బంది పెడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ఎటువంటి నేర ఘటనల్లో పాలుపంచుకున్నా అటువంటి వారిపై పీడీ చట్టం ప్రయోగిస్తామని ద్వారకా పోలీసు స్టేషన్ సీఐ డి.వి.రమణ హెచ్చరించారు. ద్వారకా పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇప్పటికే రౌడీషీట్‌లు ఉన్నవారు క్రమశిక్షణ, సత్‌ప్రవర్తనతో మెలగాలని సూచించారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

... 5వ పేజీ తరువాయి

పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షల పర్యవేక్షణకు 146 కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లను నియమించారు. అలాగే నాలుగు ఫ్లైయింగ్ స్క్వాడ్లు ఏర్పాటుచేశారు. పరీక్షా గదికి ఫోన్లు అనుమతించరు.

పకడ్బందీ ఏర్పాట్లు

ప్రాక్టికల్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. ల్యాబ్ పరికరాలు అందుబాటులో ఉన్న కళాశాలల్లోనే పరీక్షలు నిర్వహిస్తున్నాం. ప్రతి గదిలో సీసీ కెమెరా ఏర్పాటు చేసి కార్యాలయానికి అనుసంధానం చేశాం. ఇక్కడ నుంచి సిబ్బంది మూల్యాంకనం, మార్కుల నమోదుతో సహా అన్నీ విషయాలు గమనిస్తారు. - బి.మురళీధర్, ఆర్ఐవో

కల్యాణ మండపం ప్రారంభానికి మీనమేషాలా?



ధర్మానగర్‌లో నిర్మించిన కల్యాణ మండపం

- దశాబ్దకాలంగా నిరుపయోగం
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- ఏ శుభకార్యమైనా రోడ్లు మీదే..

కంచరపాలెం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 55వ వార్డు ధర్మానగర్‌లో పేదలు శుభ కార్యాలు జరుపుకోవడానికి నిర్మించిన కల్యాణ మండపం నిరుపయోగంగా ఉంది. ఇక్కడ పేదలు అధిక సంఖ్యలో నివాసం ఉంటున్నారు. వీరు శుభకార్యాలు జరుపుకోవడానికి ఎక్కడా కల్యాణ మండపాలు, సామాజిక భవనాలు అందుబాటులో లేవు. ఫలితంగా 46, 55 వార్డుల్లోని ధర్మానగర్, తిక్కవానిపాలెం, సంజీవయ్య కాలనీ, తాటిచెట్లపాలెం కాలనీల్లో నివాసం ఉంటున్న పేదలు ఇబ్బందులు పడేవారు. ఏ కార్యక్రమమైనా వీరికి వీధి రోడ్లే గతి. ఈ నేపథ్యంలో దశాబ్దం క్రితం అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న విష్ణుకుమార్ రాజుకు ఆయా గ్రామాల ప్రజలు వినతులు అందించారు. స్థానికుల సమస్యను తెలుసుకుని 2014లో ధర్మానగర్‌లోని ప్రభుత్వ స్థలంలో అధునాతన కల్యాణ మండపాన్ని నిర్మించారు. కాని నేటి వరకు దానిని ప్రారంభించక పేదల అవసరాలు తీరడం లేదు. వైసీపీ నాయకులు దీనిని ప్రారంభించడానికి ముందడుగు వేయకపోగా కల్యాణ మండపాన్ని వీఎంఆర్డీఏకు అప్పగించి వేలం వేయించాలనే ఆలోచన చేశారు. వేలం పాట పాడేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ప్రస్తుతం నిరుపయోగంగా మిగిలింది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు దృష్టి సారించి ఇక్కడ కల్యాణ మండపాన్ని ప్రారంభించాలని రెండు వార్డుల్లోని సుమారు పది గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థి దశ నుంచే నైపుణ్యంపై దృష్టి సారించాలి



జేసీఐ వైజాగ్ స్మార్ట్ నూతన అధ్యక్షురాలిగా జియ్యాని కావ్య, ఇతర సభ్యులు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే నైపుణ్యత కోసం కృషి చేయడం ద్వారా యువత సానుకూల మార్పును సృష్టిస్తుందని నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో జేసీఐ వైజాగ్ స్మార్ట్ నూతన కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. జేసీఐ వైజాగ్ స్మార్ట్ నూతన అధ్యక్షురాలిగా జియ్యాని కావ్యతో పాటు పలువురిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జేసీఐ అనేది విద్యార్థి దశ నుంచి వృత్తిలో మంచి నైపుణ్యత కోసం శిక్షణ, నాయకత్వ లక్షణాల మెరుగుకు దోహదపడుతుందన్నారు. 18-40 వయస్సులో యువత మరింతగా సామాజిక అంశాలపై దృష్టి సారించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. గౌరవ అతిథులు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ఎన్ఏడీ చీఫ్ జనరల్ మేనేజర్ దివాకర్ జయంత్, సునీతి పోలిశెట్టి, జోన్ ప్రెసిడెంట్ ఎ.సంతోష్, వైస్ ప్రెసిడెంట్ జేసీ ఓబైద్, సభ్యులు పాల్గొన్నారు.

సాధు మంజీరాలు పద్య కవితా సంపుటి ఆవిష్కరణ

సీతంపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో అమరావతి విశ్వసాహితి నిర్వహణలో పి.ఎల్.వి.ప్రసాద్ రచించిన 'సాధు మంజీరాలు' పద్య కవితా సంపుటిని ఆదివారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య కవితా సంపుటిని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో మార్పునకు, మనిషిని సన్మార్గంలో నడపడానికి సాహిత్యం బలమైన సాధనమన్నారు. గౌరవ అతిథి డాక్టర్ డి.వి. సూర్యారావు మాట్లాడుతూ పద్యం తెలుగు జాతి సంస్కృతికి వెన్నెముక అన్నారు. ప్రముఖ కవి చిన సూర్యనారాయణ పుస్తక సమీక్ష చేస్తూ ప్రసాద్ కవితా చాతుర్యాన్ని వివరించారు. కవి ఫ్రాన్సిస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలి ప్రతిని వేగి సూర్యనారాయణ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రొంగలి రాములు పాల్గొన్నారు.

బీచ్ వాలీబాల్ స్వర్ణ పతక విజేతలకు ఘన స్వాగతం



విజేతలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక జాతీయ క్రీడల పురుషుల బీచ్ వాలీబాల్ టోర్నీలో రాష్ట్రానికి స్వర్ణ పతకం అందించిన నగర క్రీడాకారులు మణికంఠ రాజు, ఎల్.దివ్య సాయిలతోపాటు కోచ్ రక్షణకుమార్, మేనేజర్ భగవాన్‌దాస్‌లకు ఆదివారం ఘనస్వాగతం లభించింది. ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక వాహనంలో ఊరేగింపుగా భారత వాలీబాల్ సమాఖ్య ఉపాధ్యక్షుడు, రాష్ట్ర సంఘం అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ గణబాబు కార్యాలయం వద్దకు చేరుకున్నారు. క్రీడాకారులతోపాటు కోచ్, మేనేజర్లను గణబాబు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మక జాతీయ క్రీడల బీచ్ వాలీబాల్‌లో తొలిసారిగా ఆంధ్రాకు పతకం అందించిన ఘనత మణికంఠ రాజు, దివ్యసాయి జట్టుకు దక్కిందని పేర్కొన్నారు. మణికంఠరాజు, దివ్యసాయిలకు ఆంధ్ర వాలీబాల్ సంఘం నుంచి రూ. 50 వేలు నగదు ప్రోత్సాహక బహుమతిని అందజేస్తున్నామని గణ తెలిపారు. ప్రత్యేక క్రీడా పాలసీలతో క్రీడారంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న కృషికి తగిన ఫలితాలు దక్కుతున్నాయని అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ స్థాయిలో కూడా పతకాలు సాధించి రాష్ట్ర క్రీడారంగ ప్రతిష్ఠను ప్రపంచ వ్యాప్తంగా చాటాలని ఆకాంక్షించారు. అర్జున అవార్డు గ్రహీతలు, వాలీబాల్ కోచ్‌లు, క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జిల్లా క్రీడాప్రాధికార సంస్థ స్వాగతం

జాతీయ క్రీడల పురుషుల బీచ్ వాలీబాల్‌లో స్వర్ణ పతకం సాధించిన మణికంఠరాజు, దివ్య సాయిలకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆదివారం విమానాశ్రయంలో హారతిచ్చి స్వాగతం పలికింది. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి జూన్ గ్యాలియట్ పుష్పగుచ్ఛాలు అందజేసి జిల్లా, రాష్ట్ర క్రీడారంగ ఖ్యాతిని పెంచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ కోచ్‌లు పాల్గొన్నారు.

ఉద్యమనేత జయగోపాల్‌కు ఘన నివాళి



జయగోపాల్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అతిథులు

సీతంపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కుల, మత ఆచారాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన నేత, మహోన్నత వ్యక్తి డాక్టర్ జయ గోపాల్ అని ప్రముఖ విప్లవ కవి సి.వి. తనయుడు ఉదయభాస్కర్ పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో భారత నాస్తిక సమాజం, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ సంయుక్తంగా డాక్టర్ జయగోపాల్ ప్రథమ వర్ధంతి సభను ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉదయభాస్కర్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో మూఢనమ్మకాల నిర్మూలనకు విశేష కృషి చేసిన డాక్టర్ జయగోపాల్ ప్రజలను జాగృతం చేయడంలో కీలకపాత్ర పోషించారన్నారు. ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్ రమణమూర్తి మాట్లాడుతూ పెరియార్ రచనల ద్వారా ప్రభావితమై జీవితాంతం మతోన్మాద శక్తులపై పోరాడారన్నారు. తన ఉపన్యాసాలు, పుస్తకాల ద్వారా ఎంతో మందిని ప్రభావితం చేశారన్నారు. భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామ్మూర్తి, కేంద్ర కమిటీ నాయకులు జె. రవి మాట్లాడుతూ డాక్టర్ జయగోపాల్ తెలుగు సహా ఇతర భాషల్లో సుమారు 35 పుస్తకాలు రాశారని చెప్పారు. ఈ సమావేశంలో నాస్తిక సమాజం నాయకులు సాయిని నరేందర్, ఉప్పులేటి నరేష్, నూకరాజు, వేదాంత మౌర్య, కొత్తపల్లి వెంకటరమణ, ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, రవి సిద్దార్థ, శ్యామల పాల్గొన్నారు.

అత్యంత ప్రజాదరణ పొందిన గాయనీమణి లతామంగేష్కర్



డాక్టర్ ఫణీంద్రుడిని సత్కరిస్తున్న అతిథులు డాక్టర్ రఘురామారావు, చంద్రశేఖర్

సీతంపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): యావత్ ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన గాయనీమణి లతామంగేష్కర్ అన్ని విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ రఘురామారావు పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో విశాఖ రసజ్ఞ వేదిక సంస్థ ఆధ్వర్యంలో భారతరత్న, గాన కోకిల లతామంగేష్కర్ తృతీయ వర్ధంతి సందర్భంగా డాక్టర్ ఫణీంద్రుడు వడ్లమాని రూపొందించిన దృశ్యమాలికను ఆదివారం ప్రదర్శించారు. డాక్టర్ రఘురామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లతామంగేష్కర్ జీవిత విశేషాలతో రూపొందించిన వీడియోను ప్రదర్శించారు. డాక్టర్ రఘురామారావు మాట్లాడుతూ సినీ నేపథ్య గాయనిగా ఆరు దశాబ్దాల పాటు ముప్పైకి పైగా భాషల్లో వేలాది పాటలు పాడి చిత్ర పరిశ్రమలో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. ఆమె ప్రతిభను గుర్తించి ఉత్తమ గాయనిగా ఎన్నో ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డులు ప్రదానం చేశారన్నారు. దృశ్య మాలికను రూపొందించిన డాక్టర్ ఫణీంద్రుడిని అతిథులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశాఖ మ్యూజిక్ అకాడమీ మేనేజింగ్ ట్రస్టీ వి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యం అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణా ఆశ్రమం స్వామీ కృష్ణ శాఖనంద, చిత్రంలో ఇతర ప్రముఖులు

సీతంపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నేడు ప్రపంచ దేశాలు యుద్ధాలతో సతమతమవుతూ శాంతి కోల్పోతున్నాయని, మత సామరస్యాన్ని కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని రామకృష్ణా ఆశ్రమం స్వామీ కృష్ణ శాఖనంద హితవు పలికారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల్లోని గాంధీ సెంటర్‌లో ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రెలిజియస్ ఫ్రీడమ్ సంస్థ ఆధ్వర్యంలో మత సమైక్యత ప్రపంచ శాంతి వారోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. శ్రీరామ కృష్ణా ఆశ్రమానికి చెందిన స్వామి కృష్ణ శాఖనంద మాట్లాడుతూ మత సామరస్యాన్ని కాపాడటంలో ఐక్యరాజ్య సమితి కృషి చేయాలని, శాంతి స్థాపనకు మత సామరస్యం ఎంతగానో దోహదపడుతుందన్నారు. శాంతిప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో పలు సంస్థల ప్రతినిధులు, మేధావులు డాక్టర్ కెఎస్ఎన్ మూర్తి, డాక్టర్ ఎల్ ప్రజ్ఞాన్, సిస్టర్ రామేశ్వరి, అబ్దుల్ మున్నేర్లు, కె.రాధా పాల్గొన్నారు.

'అంతర్జాతీయ కరాటే టోర్నీల నిర్వహణ ఘనత విశాఖదే'



సుమన్‌ను సత్కరిస్తున్న టోర్నీ నిర్వాహకులు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నిజి స్పోర్ట్సు కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన రెండో అంతర్జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ టోర్నీ ఆదివారం ముగిసింది. పోర్టు రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ టోర్నీ ముగింపు కార్యక్రమానికి సినీనటుడు సుమన్ తల్వార్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ అంతర్జాతీయ కరాటే టోర్నీలకు ఆతిథ్యమిస్తున్న ఘనత విశాఖ క్రీడారంగానికి దక్కుతుందన్నారు. వివిధ దేశాలకు చెందిన సుమారు 1200 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. ఇలాంటి పోటీల వల్ల క్రీడాకారుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని అభిప్రాయపడ్డారు. వర్ధమాన క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న నిజి స్పోర్ట్సు కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు అభినందనీయులన్నారు. అనంతరం టోర్నీ నిర్వాహకులు ఎస్‌పీఎం నాయుడు, ఇతర ప్రతినిధులు సుమన్ తల్వార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వి.రవీంద్రకుమార్, కిషోర్, సుందరం తదితరులు పాల్గొన్నారు.



రుషికొండలోని ఏ-1 గ్రాండ్‌లో భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు మనవడు విష్ణు (వెంకయ్యనాయుడు కుమార్తె దీపా వెంకట్ కుమారుడు), సాత్విక వివాహ రిసెప్షన్‌కు ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, పంచకర్ల రమేశ్‌బాబు, విష్ణుకుమార్‌రాజులతోపాటు మాజీ మంత్రి జానా రెడ్డి, పలువురు పారిశ్రామికవేత్తలు, అధికారులు హాజరయ్యారు. -ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం

హైదరాబాద్, విజయవాడలకు 12 ప్రత్యేక బస్సులు

ఎల్‌టీటీతో పాటు మరో రెండు రైళ్లు రద్దవ్వడంతో ఆర్టీసీకి పెరిగిన తాకిడి

ద్వారకా బస్‌స్టేషన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం ఆదివారం హైదరాబాద్ 5, విజయవాడ 7 ప్రత్యేక బస్సులను నడిపింది. ఎల్‌టీటీతో పాటు మరో రెండు రైళ్లు రద్దు కావడంతో హైదరాబాద్, విజయవాడ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఆర్టీసీ బస్సులను ఆశ్రయించారు. దీంతో ఆ రెండు ప్రాంతాలకు మధ్యాహ్నం నుంచి ప్రత్యేక సర్వీస్‌లను నడిపారు. సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్ వంటి సర్వీస్‌లను ఆయా ప్రాంతాలకు ఆపరేట్ చేశారు. రాత్రి తొమ్మిది గంటల సమయానికి 12 ప్రత్యేక సర్వీస్‌లను నడిపినట్టు అధికారులు తెలిపారు. ప్రయాణికుల డిమాండ్ ఇంకా అధికంగా ఉంటే అందుకు తగ్గట్టుగా రాత్రి కూడా ప్రత్యేక బస్సులు నడుపుతామని ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. సోమవారం కూడా ప్రత్యేక బస్సులు నడిపే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

విదేశీ ఉద్యోగాల పేరిట వల

... 5వ పేజీ తరువాయి

చేసుకుని కాలం వెళ్లదీస్తున్నారు. తాము తిరిగి ఇండియా వెళ్లిపోతామని ఎవరైనా అంటే మాత్రం వారిని అక్కడే వదిలేసి ఏజెంట్లు చేతులు దులిపేసుకుంటున్నారు. తర్వాత వారు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించరు. విదేశాల్లో వీసా లేకుండా బయటకు వెళ్లలేని పరిస్థితి కావడంతో వారిపై అక్కడ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు కూడా బాధితులకు అవకాశం ఉండడం లేదు. గాజువాకకు చెందిన ఒక ఏజెన్సీ షార్జాలో వెల్డర్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ గత ఏడాది అక్టోబరులో ప్రకటన ఇచ్చింది. దానిని చూసి పెదగంట్యాడ ప్రాంతానికి చెందిన గెద్దాడ లోకేశ్‌తోపాటు అనకాపల్లి జిల్లాకు చెందిన పొలుపర్తి లక్ష్మణరావు, గార రాజేశ్, పైలా రామస్వామి, శ్రీకాకుళం జిల్లాకు చెందిన కాళ్ల వెంకటరావులు ఆ ఏజెన్సీని సంప్రతించారు. అందుకు కావాల్సిన శిక్షణ ఇవ్వడంతోపాటు విమాన టికెట్లు, వీసా కల్పించే బాధ్యత తమదేనంటూ నమ్మించి ఒక్కొక్కరి నుంచి రూ.రెండు లక్షల నుంచి రూ.మూడు లక్షలు వసూలు చేసింది. అనంతరం వారికి గాజువాక ఆటోనగర్‌లో వెల్డింగ్‌లో శిక్షణ ఇప్పించింది. గత ఏడాది డిసెంబరులో వారిని విజిటింగ్ వీసా మీద షార్జా పంపించారు. షార్జా ఎయిర్‌పోర్టులో తమ ఏజెంట్ వచ్చి రిసీవ్ చేసుకుంటారని వారికి చెప్పారు. అక్కడ ఎయిర్‌పోర్టులో దిగగానే వారిని ఒక ఏజెంట్ రిసీవ్ చేసుకున్నారు. ఉద్యోగం రావాలంటే కంపెనీ పరీక్ష పెడుతుందని, అందులో పాస్ అయితేనే వెల్డర్ ఉద్యోగం వస్తుందని చెప్పారు. అక్కడ ఏదో పరీక్ష పెట్టి ఫెయిలైనందున హెల్పర్ ఉద్యోగాలు చేయాలని చెప్పారు. అందుకు ఐదుగురు యువకులు అంగీకరించకపోవడంతో...అయితే తిరిగి వెళ్లిపోవచ్చునన్నారు. తమ పాస్‌పోర్టులు ఇచ్చేసి, టిక్కెట్ ఇస్తే వెళ్లిపోతామని చెప్పగా, వారం రోజులు ఉంటే వీసా, టికెట్‌లు ఇస్తామని చెప్పి..ఏజెంట్ వెళ్లిపోయారు. ఇరవై రోజులు గడిచినా అక్కడ ఏజెంట్ రాకపోవడం, గాజువాకలోని ఏజెన్సీకి ఫోన్ చేస్తే స్పందించకపోవడంతో ఐదుగురు యువకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చివరకు సీపీ శంఖబ్రత బాగ్చీకి వాట్సాప్ కాల్ చేసి తమ పరిస్థితి వివరించడంతో సీపీ చొరవ తీసుకుని, వారిని పంపించిన ఏజెన్సీ ప్రతినిధులను గుర్తించారు. వారితోనే షార్జా నుంచి ఇండియాకు విమానం టికెట్లు తీయించి ఐదుగురు యువకులను గత నెల 22న నగరానికి తీసుకొచ్చారు. ఇలా ఎంతోమంది విదేశాల్లో ఉద్యోగాలనే ఆశతో వెళ్లి అక్కడ అక్రమ వలసదారులుగా బందీలుగా ఉండిపోతున్నారు.

అన్నీ పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలి

విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తామని ఎవరైనా చెబితే అన్నివిధాలుగా పరిశీలించుకోవాలి. ఏజెన్సీలు, ఏజెంట్లతోపాటు వారు చెప్పే కంపెనీలకు సంబంధించిన వివరాలు, ప్రభుత్వ అనుమతులు వంటివాటి కోసం ప్రభుత్వ పోర్టల్‌లో తనిఖీచేయాలి. ఆయా సంస్థలు, ఏజెన్సీల ద్వారా గతంలో ఎవరైనా వెళ్లి ఉద్యోగాలు చేస్తుంటే వారితోపాటు వారి కుటుంబసభ్యులతో కూడా ఆయా సంస్థల గురించి ఆరా తీయాలి. ఏమాత్రం అనుమానం కలిగినా, ప్రభుత్వ గుర్తింపులేని ఏజెన్సీ అని తేలినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. నగరంలో ఈ తరహా మోసాలు పెరుగుతుండడంతో ఏయూలోని అధ్యాపకులతో ఒక కమిటీ వేసి ఏజెన్సీలపై అధ్యయనం చేయించాలని యోచిస్తున్నాం. - సీపీ శంఖబ్రత బాగ్చి

క్రైమ్ రేటు పెరిగితే ఉపేక్షించేది లేదు

... 5వ పేజీ తరువాయి

వేసేందుకు అమలుచేస్తున్న వ్యూహాలను సీపీ శంఖబ్రతబాగ్చి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డీజీపీకి వివరించారు. అనంతరం డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా మాట్లాడుతూ అత్యంత ప్రాముఖ్యత కలిగిన విశాఖ నగరంలో పోలీసింగ్‌ను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్, మత్తుమందుల రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. రౌడీయిజం, భూకబ్జాలకు తావులేకుండా ముందస్తు వ్యూహాలను రచించి అమలు చేయాలన్నారు. అనంతరం శాఖాపరంగా ఉన్న సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని డీజీపీ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో డీసీపీ-1 అజితా వేజెండ్ల, డీసీపీ-2 మేరీ ప్రశాంతి, అడ్మిన్ డీసీపీ, ఏడీసీపీలు, ఏసీపీలు, సీఐలు పాల్గొన్నారు.

పూర్ణామార్కెట్ వద్ద ఆక్రమణల తొలగింపునకు నేతల మోకాలడ్డు

... 5వ పేజీ తరువాయి

వన్‌టౌన్ ట్రాఫిక్ పోలీసులను వెంట తీసుకుని పూర్ణామార్కెట్‌కు వెళ్లి ఆశీల్ వసూళ్లపై స్వయంగా వ్యాపారులను ఆరాతీశారు. గెజిట్ కంటే పది రెట్లు ఎక్కువ వసూలు చేస్తున్నట్టు నిర్ధారణ కావడంతో కాంట్రాక్టర్‌కు నోటీసు జారీ చేయాలని రెవెన్యూ విభాగం అధికారులను ఆదేశించారు. అలాగే రోడ్డును ఆక్రమించి ఏర్పాటుచేసిన దుకాణాలను శుక్రవారం మధ్యాహ్నం మూడున్నర గంటల్లోగా తొలగించాలని, లేనిపక్షంలో తామే వాహనాలను తీసుకొచ్చి తీసుకువెళ్లిపోతామని హెచ్చరించారు. అనుకున్నట్టుగానే శుక్రవారం మధ్యాహ్నం మూడున్నర గంటలకు జీవీఎంసీ, పోలీస్ అధికారులు పూర్ణామార్కెట్ మెయిన్‌రోడ్డుకు చేరుకున్నారు. వారిని చూసి కొంతమంది వ్యాపారులు స్వచ్ఛందంగానే దుకాణాలను తొలగించారు. మరికొందరు మాత్రం తమ వ్యాపారాన్ని కొనసాగించారు. ఇంతలో ఏమైందో తెలియదుగానీ దుకాణాల జోలికి వెళ్లకుండానే జీవీఎంసీ, పోలీస్ అధికారులు అక్కడి నుంచి వెనుతిరిగారు. దాంతో రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు కొనసాగడంతోపాటు, ఆశీల్ వసూళ్లు కూడా గతంలో మాదిరిగానే జరుగుతోంది. రాజకీయ నేతల నుంచి ఒత్తిళ్లు రావడం వల్లే దుకాణాలను తొలగించాలని సిద్ధపడిన అధికారులు వెనుతిరిగారని పూర్ణామార్కెట్‌లోని వ్యాపారులు చర్చించుకుంటున్నారు.

కబళించిన కెరటం

... 5వ పేజీ తరువాయి

మెరైన్ సీఐ సింహాద్రినాయుడు, ఎస్ఐ నాగేంద్రలు సిబ్బందితో కలిసి వాడపాలెం సముద్రతీరం వద్దకు చేరుకున్నారు. సూర్యతేజ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆసుపత్రికి తరలించారు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ నరసింగరావు తెలిపారు. కాగా సూర్యతేజ మృతదేహం వద్ద అతని తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు పలువురిని కలచివేసింది. పై సంఘటనతో కొత్తపేట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

క్రెబ్స్‌పై కొరడా

... 5వ పేజీ తరువాయి

చాలాకాలంగా ఫిర్యాదులు ఉన్నాయి. కంపెనీ నుంచి వచ్చే దుర్గంధంతో సమీపంలోని కేజీబీవీ పాఠశాల, తేగాడలో మోడల్ స్కూల్ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కంపెనీ నుంచి వచ్చే వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా శారదా నదిలోకి విడిచిపెట్టడం, కంపెనీని ఆనుకుని గొయ్యిలో నింపడం చేస్తున్నారు. దీంతో భూగర్భ జలాలు కలుషితం కావడంతో కంపెనీ సమీపంలోని గంటవానిపాలెం గ్రామస్థులు గతంలో ఆందోళనలు చేసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పీసీబీ అధికారులు తనిఖీలు చేసి 2023 డిసెంబరులో ఒకసారి కంపెనీని మూసివేయాలని ఆదేశించారు. తరువాత పీసీబీ నిబంధనల మేరకు కంపెనీ కొన్ని దిద్దుబాటు చర్యలు తీసుకోవడంతో గత ఏడాది జనవరిలో తిరిగి ఉత్పత్తి ప్రారంభించడానికి అనుమతించారు. తాజాగా కంపెనీ నుంచి వ్యర్థాలు విజయవాడ రూరల్‌లోని జక్కంపూడిలో పారబోయడంతో విచారణ జరిపిన పీసీబీ మరోసారి మూసివేతకు ఆదేశాలు ఇచ్చింది.

10న నిత్యానంద త్రయోదశి ఉత్సవం

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఈ నెల 10న సాయంత్రం ఆరు గంటలకు నిత్యానంద త్రయోదశి ఉత్సవాలను నిర్వహించనున్నట్టు హరే కృష్ణ మూవ్‌మెంట్ యదురాజాదాస ఒక ప్రకటనలో తెలిపారు. నిత్యానంద మహాప్రభు జన్మదినోత్సవం సందర్భంగా సప్త నదుల జలాలు, వివిధ పండ్ల రసాలు, వివిధ రకాల పూలతో మహాభిషేకం నిర్వహిస్తామని చెప్పారు. అందరూ ఆహ్వానితులేనని తెలిపారు.

జూకు 3 లక్షల 25 వేల ఆదాయం

ఆరిలోవ, ఫిబ్రవరి 9 : (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలకు ఆదివారం సందర్శకులు అధికంగా విచ్చేశారు. సుమారు 3,800 మంది నుంచి టికెట్ల రూపంలో సుమారు రూ.3 లక్షల 25 వేల ఆదాయం సమకూరినట్టు జూ క్యూరేటర్ మంగమ్మ తెలిపారు.

సినిమా గైడ్

● **తండేల్ :** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ),
● **భవానీ వార్డ్ :** జగదాంబ, రమాదేవి
● **మదగజరాజా :** జగదాంబ, వెంకటేశ్వర-1, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),
● **సంక్రాంతికి వస్తున్నాం :** శారద, మెలోడి, జగదాంబ, కిన్నెర, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
● **డాకు మహారాజ్ :** శరత్, శ్రీకన్య కిన్నెర, సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 14, వంకాయలు (తెలుపు)16, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 42, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 42, బీరకాయలు 50, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 12, క్యాబేజి 12, క్యారెట్ 26 దొండకాయలు 32, బంగాళ దుంపలు 17, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది)40, బరబాటి 30, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 62, బద్దచిక్కుడు 26, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 170, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 40, కీరదోస 26, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమ దుంపలు 40 చిలగడదుంపలు 38, కంద 56, దేముడు చిక్కుడు 28, గోరు చిక్కుడు 28, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్ కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 30, క్రరపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	90
లైవ్ ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200

దుర్గంధం భరించలేకున్నాం

» 22వ వార్డు వాసుల గగ్గోలు » కాలువల్లో పూడికల తొలగింపుపై పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యం

మద్దిలపాలెం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డులోని పలు గెడ్డల్లో పూడికలు పేరుకుపోయాయి. దీంతో ఆ పరిసరాల్లో దుర్వాసన వెదజల్లుతోంది. పారిశుధ్య సిబ్బంది నెలల తరబడి పూడికలు తొలగించకపోవడంతో కాలువలు చెత్తాచెదారంతో నిండిపోయి అధ్వానంగా మారాయి.

మద్దిలపాలెం బస్టాప్ వెనుక నుంచి పిఠాపురం కాలనీ ముత్తూట్ ఫైనాన్స్ కార్యాలయం మీదుగా ప్రవహించే గెడ్డలో పాలిథిన్ కవర్లు, వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయాయి. దీంతో మురుగు నిలిచిపోయి దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. కాయగూరల మార్కెట్ కూడా గెడ్డ పక్కనే ఉండడంతో మార్కెట్‌లోని చెత్తాచెదారం కూడా గెడ్డలో వేస్తున్నారు. అయితే ఎప్పటికప్పుడు చెత్త తొలగించకపోవడంతో ఇక్కడ డంపర్‌బిన్ నిండిపోతుంది. ఇదే సమయంలో స్థానికులు చెత్తను గెడ్డల్లో విసిరేస్తున్నారు. ఫలితంగా పీతలవానిపాలెం మీదుగా ప్రవహించే గెడ్డ మరింత దారుణంగా ఉంది. ఈ గెడ్డలో టన్నులు కొద్దీ పూడికలు పేరుకుపోయాయి. మురుగు నీటి ప్రవాహానికి అడ్డంగా చేరి దుర్వాసన వెదజల్లుతోంది. పీతలవానిపాలెంలో డంపర్‌బిన్లు లేకపోవడంతో పారిశుధ్య కార్మికులు ఉదయం వచ్చి చెత్త సేకరిస్తుంటారు. అయితే రాత్రి సమయంలో ఇంటిలో వచ్చిన చెత్తను స్థానికులు ఈ గెడ్డలో పారివేయడంతో గుట్టలుగా ఏర్పడుతోంది. దీనికి తోడు భవన నిర్మాణ వ్యర్థాలు కూడా గెడ్డల్లో వేస్తుండడంతో మరింత చెత్త పేరుకుపోతోంది. దాదాపు ఆరు నెలలుకు పైగా గెడ్డల్లో పూడికలు తీయకపోవడంతో పరిసరాలు కంపు కొడుతున్నాయి. ఇప్పటికైనాపారిశుధ్య కార్మికులు పూడికలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.


పీతలవానిపాలెం గెడ్డలో పేరుకుపోయిన పూడికలు


పాలిథిన్ కవర్లు, చెత్తాచెదారంతో నిండిపోయిన పిఠాపురం కాలనీ గెడ్డ


సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు

పకడ్బందీగా బస్సుల నిర్వహణ

» ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు

ద్వారకాబస్‌స్టేషన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు రవాణా సేవలు అందించే ఆర్టీసీ బస్సుల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని, ఏ చిన్న లోపం ఉన్నా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు అన్నారు. విశాఖపట్నం ఆర్టీసీ డిపోను, గ్యారేజీని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్యారేజీలో సాంకేతిక సిబ్బందితో సమావేశమై వారికి పలుసూచనలు చేశారు. ప్రయాణికులకు ఆర్టీసీపై ఎంతో నమ్మకం ఉందని, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తే సురక్షితంగా, సౌకర్యవంతంగా సకాలంలో గమ్యానికి చేరుకోగలమని విశ్వసిస్తున్నారన్నారు. బస్సులకు సాంకేతిక లోపాలు తలెత్తి మార్గమధ్యంలో నిలిచి పోయినా, బస్సుల్లో కుదుపులు ఏర్పడినా, సీట్లు సౌకర్యవంతంగా లేకపోయినా, కిటికీలకు అద్దాలు లేకపోవడం వంటి సమస్యల వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. అందువల్ల అటువంటి సమస్యలేవీ బస్సుల్లో లేకుండా చూడాలని ఆర్ఎం సూచించారు. సమావేశంలో డిపో అధికారులు, గ్యారేజీ మెకానిక్‌లు పాల్గొన్నారు.

నేడు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ

» పిల్లలతో తప్పనిసరిగా తల్లిదండ్రులు మాత్రలు వేయించాలి
» డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

విశాఖపట్నం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా సోమవారం నులిపురుగుల నిర్మూలనకు గాను ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నారు. జిల్లాలో ఒకటి నుంచి 19 ఏళ్లలోపు చిన్నారులకు ఈ మాత్రలను పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల చిన్నారులకు ఈ మాత్రలను అందించ నున్నారు. జిల్లాలో ఏడాది నుంచి 19 ఏళ్లలోపు వయసుగల చిన్నారులు 5,20,891 మంది ఉన్నట్టు అధికారులు గుర్తించారు. వీరిలో ఏడాది నుంచి రెండేళ్లలోపు వయసున్న పిల్లలకు సగం మాత్రను నీటిలో కరిగించి తాగించనున్నారు. రెండు నుంచి మూడేళ్ల లోపు చిన్నారులకు పూర్తి మాత్రను నీటిలో కరిగించి తాగించాల్సి ఉంటుంది. మూడు నుంచి 19 ఏళ్లలోపు వారు మాత్రను చప్పరించి వేసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సిబ్బందికి తగిన సూచనలు చేశామన్నారు. మధ్యాహ్నం భోజనం చేసిన అర గంట తర్వాత మాత్రలు వేయించేలా ఆదేశాలు జారీ చేశారు. సోమవారం, ఈ నెల 17న మాప్ అప్ రౌండ్ కార్యక్రమంలో భాగంగా తప్పకుండా అందరూ మాత్రలు వేసుకోవాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ మాత్రల పంపిణీలో విద్యాశాఖ, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, ఇతర శాఖల సహకారాన్ని తీసుకుంటున్నా మన్నారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా చిన్నారులు మాత్రలు తీసుకునేలా చూడాలని డీఎంహెచ్‌వో కోరారు. పిల్లలకు నులి పురుగులు మాత్రలు ఇవ్వకపోవడం వల్ల కడుపు నొప్పి, రక్తహీనత వంటి సమస్యలతో బాధపడాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు.

వేంకటేశ్వరాలయంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు


శ్రీచక్ర పెరుమాళ్‌తో సముద్ర స్నానంలో పాల్గొన్న భక్తులు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆరో సెక్టరులోని శ్రీవేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజైన ఆదివారం శ్రీచక్ర పెరుమాళ్‌తో కలసి భక్తులు సముద్ర తీరంలో చక్రస్నానం చేశారు.

ఈ కార్యక్రమానికి భక్తులు భారీగా హాజరయ్యారు. సాయంత్రం దేవతోద్వాసన, ద్వాదాశి ఆరాధన, శ్రీపుష్ప యాగం, ధ్వజావరోహణం, సప్తావరణలు, కుంభప్రోక్షణం వంటివి నిర్వహించారు. ఈ నెల 12న శ్రీ ఉమారామలింగేశ్వరస్వామివారి 41వ ప్రతిష్ఠా వార్షిక కల్యాణమహోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు.

బీచ్‌కు పోటెత్తిన సందర్శకులు


ఆర్కే బీచ్‌కు ఆదివారం సందర్శకులు పోటెత్తారు. కొందరు సముద్ర తీరంలో స్నానాలు చేస్తూ, ఫొటోలు దిగుతూ సందడి చేశారు. మరికొందరు ఇసుక తిన్నెలపై కూర్చుని వాతావరణాన్ని ఆస్వాదించారు.

శ్మశాన వాటికల సమస్య పరిష్కారానికి కృషి చేయండి

పెదవాల్తేరు. ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీలో గత ఐదేళ్లుగా చర్చలకు పరిమితమై వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న క్రైస్తవశ్మశానవాటికల ఏర్పాటుపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.పరశురామ్‌రాజును క్రైస్తవ మైనారిటీ నాయకులు ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు.అలాగే గతంలో ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకు కూడా వినతిపత్రం అందించినట్టు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మైనారిటీ మోర్చా నాయకులు అర్బర్ట్, జిల్లా మైనార్టీ ఇన్‌చార్జి దానేశ్, జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షురాలు భారతి తదితరులు పాల్గొన్నారు.


పరశురామ్‌రాజుకు వినతిపత్రం అందజేస్తున్న క్రైస్తవ మైనారిటీ నాయకులు

పెదవాల్తేరు గ్రామ నూతన కార్యవర్గం

పెదవాల్తేరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : పెదవాల్తేరు గ్రామ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా బచ్చు తవిటి రెడ్డి, మరడ శ్రీనివాసరెడ్డి ఎన్నిక య్యారు. పెదవాల్తేరు గ్రామ చరిత్రలో మొట్టమొదటి సారిగా సీక్రెట్ బ్యాలెట్ పద్ధతిలో అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి పదవులకు ఎన్నిక జరిగింది. గ్రామ కమిటీ సభ్యులు,వీధి అధ్యక్ష, కార్యదర్శులు, వివిధ సంఘాల అధ్యక్షులు 160 మంది సభ్యులు పాల్గొన్నారు 14 ఈ ఎన్నికలు గ్రామ గౌరవాధ్య క్షుడు బోర అప్పలదాసు రెడ్డి, బైరెడ్డి పోతన్నరెడ్డి, బోర కుమార్ రెడ్డి, సీహెచ్ లక్ష్మణరెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి, ఎన్నికల అధికార పర్యవేక్షణలో జరిగాయి. ఈ కార్యవర్గం రెండు సంవత్సరాలు పని చేస్తుందని ఎన్నికల అధికారి వెల్లడించారు.


నూతన కార్యవర్గ ప్రతినిధులు

భీమిలిలో బీజేపీ బలోపేతానికి మరింత కృషి చేయాలి : పరశురామ్‌రాజు

భీమునిపట్నం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): భీమిలి నియోజకవర్గంలో బీజేపీని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలను ఆ పార్టీ జిల్లా ఎం.పరశురామ్‌రాజు పిలుపు నిచ్చారు. ఆదివారం గాడు వీధిలో ఉన్న ఆ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన విస్తృత కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. నియోజకవర్గంలో పెద్ద ఎత్తున పార్టీ సాధారణ, క్రియాశీలక సభ్యత్వాలు చేసినందుకు అందరినీ అభినందించారు. అదే స్ఫూర్తితో మండలాలు, వార్డులలో మిగిలివున్న బూత్ కమిటీలను, వార్డు కమిటీలను నియామకాలు వారం రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు.

నేటి నుంచి విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందు పంపిణీ

పద్మనాభం రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో చదువుతున్న 1-19 సంవత్సరాలలోపు విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందులు సోమవారం నుంచి పంపిణీ చేయనున్నట్టు రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.స్వప్న తెలిపారు.

జిల్లా కలెక్టర్, జిల్లా ఆరోగ్య వైద్యాధికారి ఆదేశాలమేరకు జాతీయ నులిపురుగుల కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు ఆమె తెలిపారు. పాఠశాలలోని ఉపాధ్యాయులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతి ఒక్కరూ చిన్నారులకు నులిపురుగుల మందులు అందేలా చూడాలని సూచించారు.

ఎన్ఎంయూఏ రీజనల్ అధ్యక్ష, కార్యదర్శులుగా మూర్తి, శంకరరావు

ద్వారకాబస్‌స్టేషన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) రీజనల్ అధ్యక్షునిగా పీఎన్ మూర్తి, కార్యదర్శిగా పి.శంకరరావు ఎన్నికయ్యారు. వాల్తేరు డిపో ఎన్ఎంయూఏ కార్యాలయంలో ఆదివారం జరిగిన రీజనల్ మహా సభలో వీరిరువు రూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్ఎంయూఏ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి మాట్లాడుతూ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం నిరంతరం కార్మికుల సంక్షేమానికే కృషి చేస్తుందన్నారు. రాగద్వేషాలకు అతీతంగా నాయకులు చిత్తశుద్ధితో పని చేస్తున్నారన్నారు. జోనల్ కార్యదర్శి ఎంవీఆర్ మూర్తి మాట్లాడుతూ ఆర్టీసీలో అతి పెద్ద అసోసియేషన్‌గా ఏర్పడి కార్మికుల పక్షాన నిలిచి వారి సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నామన్నారు. సమావేశంలో రాష్ట్ర కోశాధికారి వీవీవీ మోహన్, కార్యదర్శులు వి.అప్పారావు, జీఆర్ రావు, నాయకులు వి.ప్రదీప్ కుమార్, రాములు, తదితరులు పాల్గొన్నారు.


మూర్తి, శంకరరావులను అభినందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఈఎన్‌సీని సందర్శించిన ఎయిర్ మార్షల్

విశాఖపట్నం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఎయిర్ మార్షల్ (మెడికల్) ఎంఎస్ శ్రీధర్ ఆదివారం తూర్పు నావికాదళాన్ని సందర్శించారు.ఈఎన్‌సీ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెందార్కర్ ఆహ్వానం మేరకు ఆయన ఇక్కడకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఇరువురు ఉన్నతాధికారులు కాసేపు వివిధ అంశాలపై మాట్లాడుకున్నారు. మెడికల్ సౌకర్యాలగురించి చర్చించారు. అత్యవసర రోగులకు లైవ్ రేడియేషన్ విధానాన్ని డ్రిల్ రూపంలో ఎయిర్ మార్షల్ చూపించారు. అనంతరం శ్రీధర్‌కు రాజేశ్ పెందార్కర్ జ్ఞాపికను అందజేశారు.


శ్రీధర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న నేవీ వైస్ అడ్మిరల్ రాజేశ్

విశాఖ పోర్టుకు విచ్చేసిన జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్

విశాఖపట్నం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిశోర్ మక్వానా ఆదివారం తమ బృందంతో కలిసి విశాఖ పోర్టు అథారిటీని సందర్శించారు. పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్, డిప్యూటీ కన్జర్వేటర్ టి.శ్రీనివాస్‌లు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అధికారులు పోర్టు ఆధునికీకరణ, దిగుమతులు, ఎగుమతులు, వ్యాపార అవకాశాలపై సమగ్ర సమాచారాన్ని కిశోర్ మక్వానాకు వివరించారు. పోర్టు సామర్థ్యాన్ని పెంచేందుకు తీసుకుంటున్న చర్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా కిశోర్ మక్వానా మాట్లాడుతూ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతున్న వాణిజ్య హబ్‌గా పోర్టును ప్రశంసించారు.


జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిశోర్ మక్వానాకు స్వాగతం పలుకుతున్న పోర్టు అధికారులు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నామినేషన్లకు నేడు చివరి రోజు

విశాఖపట్నం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడానికి సోమవారంతో గడువు ముగియనున్నది. ఈ నెల మూడో తేదీ నుంచి నామినేషన్లు స్వీకరిస్తున్నారు. శుక్రవారం వరకు ఎనిమిది మంది 14 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్లను 11వతేదీ పరిశీలిస్తారు. 13న ఉపసంహరణకు గడువిచ్చారు. ఈ నెల 27న ఎన్నికలు జరుగుతాయి.

జాతీయ యోగా పోటీలకు విశాఖ వాసులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రం త్రివేండ్రంలో ఈ నెల 13 నుంచి నాలుగు రోజుల పాటు జరగనున్న జాతీయ యోగా పోటీలకు జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ నుంచి 24 మంది హాజరు కానున్నట్టు అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి యూవీ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరగనున్నాయి.